



● అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం) : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 వరకు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. అధికారులంతా వారు పనిచేసే స్థానంలో అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు ఆగిపోయే వరకు సెలవులు మంజూరు చేయమని తెలిపారు. కలెక్టరేట్‌లో 0861-2331261, 79965576699 నంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు.

నెల్లూరు: నగరంలో నీట మునిగిన తల్పగిరి కాలనీ

వాయుగండం

- జిల్లాలో కొన్ని చోట్ల భారీ, మరికొన్నిచోట్ల మోస్తరు వర్షం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం
- లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు
- 7 మండలాల్లో 957 హెక్టార్ల పంట నష్టం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

నెల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది.ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆగాగి వాన పడుతూనే ఉంది. కొన్ని మండలాల్లో భారీగా, మరికొన్ని మండలాల్లో మోస్తరుగా వర్షం కురిసింది.దీంతో జనజీవనం స్తంభించింది. బుధవారం జిల్లాలో సరాసరి 67.1 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఆత్మకూరులో 145.6 మి.మీ, దుత్తలూరులో 117.2 మి.మీ, కందుకూరులో 108.8 మి.మీ, అనంతసాగరంలో 103.8 మి.మీ, లింగసముద్రంలో 96 మి.మీ, సైదాపురంలో 93.2 మి.మీ, రాపూరులో 91.2 మి.మీ, సంగంలో 84.2 మి.మీ, వింజమూరులో 84 మి.మీ, ఏఎస్‌పేటలో 83.4 మి.మీ, మర్రిపాడులో 80.2 మి.మీ గుడ్లూరులో 77.2 మి.మీ, నెల్లూరు అర్బన్‌లో 74.2 మి.మీ, మనుబోలులో 74.2 మిమీ, వెంకటాచలంలో 72.4 మి.మీ, నెల్లూరు రూరల్‌లో 67.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.



ముత్తుకూరు: సముద్ర తీరంలో ఎగసిపడుతున్న అలలు



కందుకూరు : భారీ వర్షాలతో పొంగి ప్రవహిస్తున్న ఉప్పుటేరు



మనుబోలు : ఉధృతంగా ప్రవహిస్తున్న కల్లేరు వాగు

● నేడు కూడా సెలవు

నెల్లూరు(విద్య) : భారీ వర్షాల కారణంగా గురువారం (నేడు) కూడా అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలు ఇచ్చారని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు ఆర్ఐవో వరప్రసాద్‌రావు తెలిపారు.

● పొంగుతున్న వాగులు, వంకలు

ఈ ప్రభావంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దుత్తలూరు మండలం ముత్తరాసిపల్లి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మర్రిపాడు మండలం నాయుడుపల్లి వద్ద కేతమన్నేరు వాగు, పెగళ్లపాడు వద్ద బొగ్గేరు పొంగి రహదారులపై ప్రవహిస్తున్నాయి. జలదంకి మండలం గోపన్నపాలెం వద్ద వాగు పొంగి రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపేశారు. అనంతసాగరం మండలం ముత్తుకూరు వద్ద వాగు ప్రమాదభరితంగా ప్రవహిస్తోంది. వరికుంటపాడు మండలం కనియంపాడు-రామదేవులపాడు గ్రామాల మధ్య పిల్లాపేరు వంతనపై రాకపోకలు నిలిచిపోయాయి. కాగా పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. నెల్లూరులో రోడ్లపై నీరు ప్రవహిస్తుండగా, ఎక్కడికక్కడ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది ఆ నీటిని బయటకు పంపుతున్నారు.



కావలి : రాజీవ్‌నగర్‌లో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు



అనంతసాగరం : పాతాళపల్లెలో నీట మునిగిన వరిని చూపుతున్నరైతులు

● 957 హెక్టార్లలో పంట నష్టం

భారీ వర్షాల కారణంగా కొన్ని మండలాల్లో వరి పైరు కోత దశలో ఉండగా దెబ్బతింది. ఇప్పటి వరకూ 957.4 హెక్టార్లు(2393.50 ఎకరాలు)లో వరి, మినుము, వేరు శనగ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.ఈ నష్టం ప్రధానంగా అనంతసాగం, కలువాయి, చేజర్ల మండలాల్లో జరిగింది. మొత్తం ఏడు మండలాల్లోని 15 గ్రామాలకు చెందిన 796 మంది రైతులు పంట నష్టపోయారు.

సోమశిలకు కొనసాగుతున్న వరద

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. బుధవారం ఉదయం 20 వేల క్యూసెక్కులు కొనసాగగా, సాయంత్రానికి 28 వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో డ్యాంలో 69.686 టీఎంసీలు నిల్వ ఉంచి, దిగువకు గేట్ల ద్వారా పెన్నాలోకి 32,650 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాగా జలాశయాన్ని ఎస్ఈ వెంకటరమణారెడ్డి, అనంతసాగరం తహసీల్దారు జయవర్ధన్ పరిశీలించారు. ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వచ్చే ఇన్‌ఫ్లోను బట్టి దిగువకు నీటి విడుదల పెంచాలని తెలిపారు.

● కండలేరులో 59.910 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.910 టీఎంసీలుగా ఉందని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 5150 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 3050 క్యూసెక్కుల అవుట్ ఫ్లోగా ఉందని ఆయన తెలిపారు.



సోమశిల జలాశయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాళ్లపాడు వద్ద అప్రమత్తంగా ఉండండి

లింగసముద్రం : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన రాళ్లపాడును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించారు. నీటి నిల్వ సామర్థ్యం గురించి ఈఈ మునిత్నం, డీఈఈ ఎం వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రెండు స్పిల్‌వేలలోని గేట్లను పరిశీలించారు. ప్రాజెక్టులో ఏఈలు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని అధికారులు వివరించారు.దీంతో సబ్ కలెక్టర్ నలుగురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ పీ శేషయ్య, ఏఈఈ బీ మనోహర్, ఆర్ఐ ఎం రమణయ్య సిబ్బంది ఉన్నారు.



రాళ్లపాడును సందర్శించి, అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీ

సంగం బ్యారేజీకి 68 వేల క్యూసెక్కుల ప్రవాహం

సంగం : సంగ బ్యారేజీకి సోమశిల జలాశయం, బీరాపేరు, బొగ్గేరు నుంచి సుమారు 68 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుంది. జోరుగా వర్షాలు కురుస్తుండడంతో సోమశిల నుంచి సంగం బ్యారేజీకి సుమారు 32 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నది. దీంతో బీరాపేరు, బొగ్గేరు బీరాపేరు వాగుల నుంచి మరో 36 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి పెన్నాలో కలుస్తుంది.దీంతో బ్యారేజ్ వద్ద నీటి మట్టం 10.8 అడుగులుగా నమోదయింది. బ్యారేజ్ గేట్లకు వరద నీటి ప్రవాహం తగలకుండా 79 గేట్లు పైకెత్తి వచ్చిన వరద ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు.

నావూరు పెద్దవాగు ఎస్పీ పరిశీలన

పొదలకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నావూరుపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నావూరు పెద్దవాగును బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా వరద ఎక్కువ కావడంతో మూడు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ఎస్పీ వాగును పరిశీలించి, తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసులు, పొదలకూరు సీఐ శివరామ కృష్ణారెడ్డి, ఎస్ఐ ఎండీ హనీఫ్, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ వరప్రసాద్, పీఏసీఎస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, స్టేషన్ సిబ్బంది రవితేజ, శ్రీను, షరీఫ్, పరుశురాం ఎస్పీ వెంట ఉన్నారు.



ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొంటాం...

- అప్రమత్తంగా జిల్లా యంత్రాంగం
- అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ


నెల్లూరు(సిటీ),అక్టోబరు 22,(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల ఎదురయ్యే ఎలాంటి వైపరీత్యాన్నైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాలను గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ముందుగానే కాలువల్లో పూడికతీత పూర్తయినందున వర్షపునీరు నగరంలో ఎక్కడ ఆగకుండా వెళ్తున్నాయని తెలిపారు. నెల్లూరులో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తికి సీఎం చంద్రబాబు రూ. 165 కోట్లు విడుదల చేశారని వెల్లడించారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ వద్ద పరిశ్రమలను ఏర్పాటు చేసి, వేల మందికి ఉపాధి కల్పిస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా , ఎన్ఎంసీ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌లు పాల్గొన్నారు.

● అధికారులు బాగా పనిచేశారు..

నగరంలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడకుండా కార్పొరేషన్ అధికారులు శ్రమించడాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా అభినందించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నగరంలో వర్షం తాకిడికి ప్రధాన కూడళ్లు, రహదారుల్లో నీటిని వెంటనే బయటకు వెళ్లేందుకు కమిషనర్ నేతృత్వంలో ఉద్యోగులు, సిబ్బంది పనితీరు ప్రశంసనీయమన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ, పక్కన కలెక్టర్ హిమాన్షు శుక్లా , వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు





జిల్లా మీదుగా

బుల్లెట్ పరుగు


- హైస్పీడ్ రైల్ కారిడార్‌కు అడుగులు
- హైదరాబాద్-చెన్నైమధ్య ఏర్పాటుకు ప్రతిపాదనలు
- జిల్లాలో 117 కి.మీ దూరం.. 3 హాల్టింగ్‌లు
- వచ్చే మార్చి నాటికి నివేదిక సిద్ధం

నెల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి మరో కీలక ప్రాజెక్టు చేరువ కాబోతోంది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన హైస్పీడ్ ట్రైన్ ఎలివేటెడ్ కారిడార్(బుల్లెట్ ట్రైన్) జిల్లా మీదుగా నిర్మాణం జరగడానికి అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్ - చెన్నై మధ్య ఈ హైస్పీడ్ ట్రైన్ కారిడార్‌ను నిర్మించేందుకు రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి ప్రాథమిక రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసింది. హైదరాబాద్ నుంచి గుంటూరు, నెల్లూరు, తిరుపతి ఎయిర్‌పోర్ట్ మీదుగా చెన్నై ఔటర్‌రింగు రోడ్డు వరకూ ఈ నూతన కారిడార్ నిర్మాణం జరగనుంది. మొత్తం 760 కి.మీ దూరం నిర్మించనున్న ఈ కారిడార్‌ను రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో నడిచేలా నిర్మించడానికి ఆలోచన జరుగుతోంది. ఇందులో అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 117 కి.మీ మేర ఈ కారిడార్ ఉంటుంది. హైదరాబాద్-చెన్నై మార్గంలో మొత్తం 9 హాల్టింగ్ స్టేషన్లను నిర్మించనున్నారు. అందులో మూడు స్టేషన్లు ఉమ్మడి జిల్లాలో ఉండడం విశేషం. కావలి, నెల్లూరు, గూడూరు ప్రాంతాల్లో బుల్లెట్ ట్రైన్లు ఆగనున్నాయి. అయితే ఇప్పుడున్న రైల్వే ట్రాక్‌కు సంబంధం లేకుండా ప్రత్యేక రూట్‌మ్యాప్‌లో హైస్పీడ్ ట్రైన్ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఒక్కో రైల్వే స్టేషన్‌ను 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించాలని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు గానూ జిల్లాలో 350.37 హెక్టార్ల భూమి అవసరమవుతుంది. ఆ భూమి మొత్తాన్ని భూసేకరణ చట్టం కింద సేకరించనున్నారు. ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు సుమారు రూ.3.04 లక్షల కోట్లు అవుతుందని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చేమార్చి నాటికి ఈ హైస్పీడ్ ట్రైన్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన పూర్తి నివేదికను రైల్వే అధికారులు బోర్డుకు అందజేయనున్నారు. ఈ బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తే నెల్లూరు నుంచి చెన్నైకు గంటలోపే చేరుకోవచ్చు. అలానే నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు రెండు గంటల్లో చేరుకోవచ్చు.

బోగస్ హాజరుపై దృష్టి

- విద్యార్థులు, టీచర్ల అటెండెన్స్‌పై గురి
- పాఠశాలల నిర్వహణపై అధికారుల ఫోకస్

నెల్లూరు(విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల బోగస్ హాజరుపై పాఠశాల విద్యాశాఖ గురిపెట్టింది. ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకే యాప్‌లో హాజరు నమోదు చేయడంతోపాటు 9.30 గంటలకు హాజరు నివేదికను అధికారులకు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల్లో బోగస్ హాజరు నమోదు కాకుండా డీఈవోతో పాటు డిప్యూటీఈవోలు, ఎంఈవోలు ప్రత్యేక దృష్టి సారించి, ఉపాధ్యాయులంతా సమయానికి హాజరయ్యేలా పర్యవేక్షిస్తున్నారు. కొత్త ఉపాధ్యాయుల నియామకాలు, ఉపాధ్యాయుల బదిలీలు పూర్తయిన నేపథ్యంలో సిలబస్ బోధన, పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల విధులకు సంబంధించి పక్కాగా వ్యవహరించాలని విద్యాశాఖ నిర్ణయించింది.



● సమయ పాలనపై...

ఉపాధ్యాయుల సమయపాలనపై దృష్టి సారించిన పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయనున్నది. ఇందులో భాగంగా టీచర్లంతా ప్రతిరోజూ ఉదయం 9 గంటలకే పాఠశాలలకు హాజరు కావాలని, సాయంత్రం 4 గంటల వరకు కచ్చితంగా పాఠశాలల్లోనే ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ఎవరైనా లీవ్ పెడితే లీవ్ కూడా 9 గంటలలోపే దరఖాస్తు చేసుకోవాలి. స్పెషల్ డ్యూటీపై వెళితే తప్పనిసరిగా హాజరు నమోదు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. అలాగే ప్రతిరోజూ ఉదయం 9.15 గంటలకు అటెండెన్స్ రిపోర్ట్ తీసి పంపించాలి. ఈ రిపోర్ట్‌లో లీవ్ దరఖాస్తు చేయకుండా ఉన్నా, ఇన్‌టైమ్ మార్క్ చేయకున్నా, స్పెషల్ డ్యూటీ పెట్టి హాజరు నమోదు చేయకపోయినా వారికి షోకాజ్ నోటీసులు ఇస్తామని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ పదేపదే జరిగితే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు. పాఠశాలల పనితీరుపై విద్యాశాఖ కమిషనర్ ప్రతిరోజూ ఉదయం పది గంటలకు ఆర్జేడీలు, డీఈవోలు, డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలతో వెబెక్స్ నిర్వహించనున్నారు.

● ప్రత్యేక సెల్ ఏర్పాటు

జిల్లాలోని పాఠశాలలు, టీచర్ల పనితీరు, హాజరు, సమయపాలన అంశాలపై మానటరింగ్ చేసేలా కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ సిబ్బంది, టీచర్లంతా కూడా సమయపాలన పాటించి పాఠశాలల ఉన్నతికి పాటుపడాలని జిల్లా అధికారులు విజ్ఞప్తి చేశారు. టీచర్ అటెండెన్స్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించిన నేపథ్యంలో ఉపాధ్యాయులు ఎవరూ అలసత్వం వహించవద్దని అధికారులు అంటున్నారు. ఆటంకాలను అధిగమించి సమయానికి పాఠశాలలకు చేరుకుని హాజరు నమోదు చేసుకోవాలంటున్నారు. అలాగే సాయంత్రం కూడా పాఠశాల ముగిసిన తరువాత సమయాన్ని తప్పక నమోదు చేయాలి. మధ్యాహ్నం లీవ్ పెట్టేవారు 12.30 గంటల తరువాత మాత్రమే అవుట్ షైట్ నమోదు చేయాల్సి ఉంటుంది. ఉదయం లీవ్ పెట్టేవారు మధ్యాహ్నం 12.45 లోపు హాజరు నమోదు చేసుకోవాలి.

ఎన్జీవో ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

రాపూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాపూరు మండలం ఏపీ ఎన్జీఓ కార్యవర్గం ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ప్రస్తుత కార్యవర్గ పదవీ కాలం ఈనెల 22వ తేదీతో పూర్తి కావస్తుండడంతో తిరిగి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 27వ తేదీన నామినేషన్ల దాఖలు, ఫలితాలు కూడా అదే రోజున వెలువరించనున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా పరిషత్ సీనియర్ సహాయకులు లక్కాకుల పెంచలయ్యను నియమించినట్లు ప్రస్తుత కార్యవర్గ సభ్యులు బుధవారం తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11847
వెండి కిలో ధర	రూ. 158300
వెండి ఒక గ్రాము	రూ. 164.30



సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

● సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ క్రాంతి కిరణ్

వెంకటాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జీ క్రాంతి కిరణ్ సూచించారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవన్నారు.

?. ఎక్కువగా ఎలాంటి వ్యాధులతో రోగులు ఆసుపత్రికి వస్తున్నారు

!. జ్వరం, జలుబు, దగ్గు, కీళ్ల నొప్పులతో ఎక్కువ మంది చికిత్స కోసం వస్తున్నారు.

?. జ్వరాలు రాకుండా ఏ చర్యలు తీసుకోవాలి

!. తాగునీటిని వేడి చేసి చల్లార్చుకుని తాగాలి. దీంతో నీటిలోని సూక్ష్మజీవులు మరణిస్తాయి. అప్పటికీ జ్వరాలు తగ్గక పోతే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వేసుకోవాలి.

ఆరోగ్యం

?. ఎలాంటి చికిత్స చేయించుకోవాలి

!. విష జ్వరాల పీడితుల్లో రక్త కణాలు తగ్గి పోయే ప్రమాదం ఉంది. ఈ సమయంలో శక్తి తగ్గి బలహీనంగా ఉండటం, ఒళ్లు, కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయి. వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలి. సులభంగా అరిగే పౌష్టికాహారం తీసుకోవాలి.

?. వర్షాకాలంలో ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి

!. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వాన నీటిలో దోమలు గుడ్లు పెడతాయి. ఆ గుడ్లు దోమలుగా మారకుండా లార్వా దశలోనే నివారిస్తే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక జ్వరాల నుంచి బయటపడవచ్చు.

కార్తీకం.. శివ స్వరూపం

పొదలకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం వచ్చిందంటే శివాలయాలు భక్తులతో కళకళలాడుతుంటాయి. ఈ మాసాన్ని సాక్షాత్తు పరమేశ్వరుడి స్వరూపంగా భావించి భక్తులు నెలరోజుల పాటు దీక్షతో పూజలు చేస్తారు. ఉపవాసాలు చేసి పార్వతీ పతిని అభిషేకాలతో కొలుస్తారు. ఆకాశదీపాన్ని వెలిగించి కుటుంబమంతటిని చల్లగా చూడమని వేడుకుంటారు. ఈ ఏడాది బుధవారం నుంచి కార్తీక మాసోత్సవం ప్రారంభమవడంతో పట్టణంలోని చోళులు కాలం నాటి శివాలయంతో పాటు మండలంలోని డేగపూడి, పీజీపట్నం, బిరదవోలు, చెన్నారెడ్డిపల్లి, విరువూరు, తాటిపర్తి, శైవ క్షేత్రాల్లో సుందరంగా ముస్తాబై భక్తుల పూజలందుకుంటున్నాయి.

యూరియా కోసం ఆందోళన వద్దు

వెంకటాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : యూరియా విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చవటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు తెలిపారు. మండలంలోని కంటేపల్లి రైతు సేవా కేంద్రంలో బుధవారం జోరువానలో సైతం రైతులకు యూరియాను పంపిణీ చేశారు. యూరియా కార్డులు కూడా రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి యూరియాను అందజేస్తున్నామన్నారు. రైతులకు అన్ని విధాలుగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అండగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, చవటపాళెం పీఏసీఎస్ డైరెక్టర్ ఆస్తోటి నాగరాజు, అగ్రికల్చర్ ఏఓ హరికరుణాకర్ రెడ్డి, నీటి సంఘం సభ్యుడు ఆస్తోటి సుబ్బయ్య, నేతలు టంగుటూరి హిమల్‌కుమార్‌రెడ్డి, దొడ్డక నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కోనలో గరుడ సేవ

రాపూరు, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): స్వాతి నక్షత్రం పురస్కరించుకుని బుధవారం పెంచలన్సింహుడు స్వర్ణగరుడ వాహనంపై దర్శనమిచ్చారు. తెల్లవారుజామున శ్రీవారికి చందనాలంకారసేవ, అభిషేకాలు నిర్వహించి, కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. శాంతిహోమం నిర్వహించారు. స్వర్ణగరుడ వాహనంపై కొలువుదీర్చి ఆస్థాన సేవ నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదానం, అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

వామ్మో.. భయోమెడికిల్ వ్యర్థాలు !

● పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ముప్పు
● నిబంధనలకు నీళ్లు

ముత్తుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రుల్లో చికిత్స తర్వాత పేషెంట్ల ప్రాణాలను కాపాడే ఔషధాలు, పరికరాలే చివరికి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. బయోమెడికల్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ నిర్లక్ష్యంగా పడేస్తుండడంతో పర్యావరణానికి, జీవ వ్యవస్థకు హానికరంగా మారుతోంది. తాజాగా ముత్తుకూరు మండలంలో వెలుగుచూసిన ఘటన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. పెద్దఎత్తున మెడికల్ వ్యర్థాలను ఇక్కడి పెద్ద చెరువులో పడవేయడం గమనార్హం. చెరువు పక్కనే నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాల్లోను, చెరువులో చేప పిల్లలను వదిలి సాగు చేసుకుంటున్న మత్స్యకారుల్లోనూ ఈ సంఘటన ఆందోళన రేపుతోంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముత్తుకూరు పరిసర ప్రాంతాల ప్రైవేటు ఆసుపత్రుల నుంచి వాడేసిన సర్జికల్ గ్లోవ్స్, ఇంజెక్షన్లు, సిరంజీలు, ప్లాస్టిక్ బాటిళ్లు, బ్యాండేజీలు పెద్దఎత్తున రాత్రివేళల్లో చెరువులు, కాలువల్లో పడేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. ఈ వ్యర్థాలు నీటి ద్వారా వ్యాపించి పశువులకు, చేపలకు, చివరికి మనుషులకు సైతం తీవ్ర హానికరంగా మారుతున్నాయి. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ చట్టం - 2016 ప్రకారం ఆసుపత్రులు, క్లినిక్‌లలోని వ్యర్థాలను ప్రత్యేక పసుపు, నీలం, ఎరుపు రంగు కవర్లలో వేరు చేయాలి. వాటిని ప్రభుత్వం గుర్తించిన సెంట్రల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌కు అప్పగించాలి. కానీ చాలామంది ప్రైవేటు ఆసుత్రు ల నిర్వాహకులు ఖర్చు, రవాణా ఇబ్బందుల పేరుతో ఈ నిబంధనలను విస్మరిస్తున్నారు. మెడికల్ వ్యర్థాలను సాధారణ చెత్తతో కలిపి బయటపడేస్తున్నారు. వీటిలో సూదులు, రక్తం అంటిన కవర్లు, బ్యాక్టీరియాతో నిండిన వస్తువులు కలిసి ఉంటున్నాయి. ఇవి తెరిచి ఉన్న నీటి వనరుల్లో కలిస్తే ప్రమాదమే. చర్మవ్యాధులు, ఇన్ఫెక్షన్లు, టైఫాయిడ్, హెపటైటిస్ లాంటి వ్యాధులు సులభంగా వ్యాపిస్తాయని వైద్యాధికారులు అంటున్నారు. ఒక్క కిలో మెడికల్ వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించకపోతే నీటి నాణ్యత, నేల మన్నికపై ప్రభావం చూపుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ముత్తుకూరు వంటి గ్రామీణ ప్రాంతాల్లో ఇది పెద్ద ప్రమాదానికి దారి తీస్తుంది. ఎందుకంటే నీటిని శుద్ధి చేసే ప్రక్రియ కష్టం, ఖర్చుతో కూడినది కాబట్టి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యర్థాల సేకరణకు ప్రత్యేక వాహనాలు ఉన్నప్పటికీ వాటి పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి ఆసుపత్రి నుంచి ఎంతమేరకు వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయో, వాటిని ఎక్కడ పడేస్తున్నారో చూసేవారు ఎవరూ లేరు. దీనిపై పంచాయతీ, పర్యావరణ, వైద్యశాఖల సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్య తీవ్రత మరింత పెరుగుతోంది.



చెరువులో పడవేసిన మెడికల్ వ్యర్థాలు

● వ్యాధుల ముప్పు... ప్రజల్లో భయం!

ముత్తుకూరు పరిసర గ్రామాల ప్రజలు ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వ్యాధులు విస్తరించే ప్రమాదం ఉందని, పిల్లలు, వృద్ధులు సులభంగా ప్రభావితమవుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్పిటల్ వ్యర్థాలు కళ్లముందే ఎక్కడంటే అక్కడ పడేస్తుంటే చాలా భయం వేస్తోందని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

● తక్షణ చర్యలే పరిష్కారం...

నిపుణులు సూచిస్తున్నట్లు ఆసుపత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాల సేకరణ, నిల్వ, తరలింపు, నిర్వహణ వ్యవస్థలను పటిష్ఠం చేయాల్సి ఉంది. క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి. బాధ్యులైన వైద్యశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేదంటే ఇది ప్రజారోగ్యానికి పెను శాపమే.

గుర్రపుడెక్కను తొలగించిన నేతలు

వెంకటాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిడిగుంటపాళెం సమీపంలో అట్రంవారికండ్రిగ వద్ద కాలువలో గుర్రపు డెక్క భారీగా పేరుకుపోయింది. అయితే కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నక్కల కాలువలో వరద ప్రవాహం భారీగా పెరిగింది. కాగా కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించకపోతే పొలాలు ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన చెందారు. ఈవిషయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సోమిరెడ్డి అధికారులు, నేతలను అప్రమత్తం చేశారు. దీంతో బుధవారం చవటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, నేతలు సన్నారెడ్డి బాలకృష్ణరెడ్డి, పేర్నాటి విజయసేనారెడ్డి, పాపారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దువ్వూరు చంద్రమోహన్‌రెడ్డి అట్రంవారికండ్రిగ వద్దకు చేరుకొని పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. కాలువలో భారీగా పేరుకుపోయిన గుర్రపుడెక్కను ప్రొక్లెయిన్ సాయంతో తొలగించారు. దీంతో సోమిరెడ్డి చూపిన ప్రత్యేక చొరవతో రైతులకు వరద ముప్పు తప్పింది. సమస్య తెలిసిన వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి రైతులు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నారు.

జొన్నవాడ ఆలయంలో ఆకాశదీపం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా బుధవారం ఆలయ అంతరాలయ మండపంలో ఆలయ పండితులు ఆకాశదీపం వెలిగించి విశేష పూజల నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆకాశదీపాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

తెలుగు సాహిత్యోత్సవానికి గండికోటకు ఆహ్వానం

హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించనున్న ఛాయ తెలుగు లిటరరీ ఫెస్టివల్‌కు బుచ్చిరెడ్డిపాళెంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్‌ను ఆహ్వానించారు. తెలుగు సాహిత్యాభిమానులను ఏకం చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సభలో 'వేమన సాహిత్యం - సమాజంపై ప్రభావం' అనే అంశంపై ప్రసంగించే అవకాశం దక్కడం పట్ల గండికోట హర్షం వ్యక్తం చేశారు.

సహాయక చర్యలు చేపడతాం

● వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్







మనుబోలు : పల్లిపాళెం గిరిజన కాలనీవాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, కోవూరు : లోతట్టు ప్రాంతాల్ని పరిశీలిస్తున్న తహసీల్దారు సుబ్బయ్య, పొదలకూరు : కండలేరు ఎడమగట్టు కాలువలో నీరు

మనుబోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాలకు, వరదలకు ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని సహాయక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా పేర్కొన్నారు. మండలంలోని పల్లిపాళెం వద్ద సముద్రంకు వెళ్ళే వాగు పొర్లుకట్టకు బుధవారం గండిపడింది. దీంతో గండికి సమీపంలో ఉన్న గిరిజనకాలనీ మునిగి ఇబ్బందులు పడతారన్న సమాచారంను గ్రామస్తులు కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో కలెక్టర్ శుక్లా హుటాహుటిన గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడున్న గిరిజనులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీలో అంగన్‌వాడీ, పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని తొలగించి కొత్తవి నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌ను గిరిజనులు కోరారు. అన్ని సమస్యలు తీర్చుతామని, అధికారులను పంపి పరిష్కరిస్తామన్నారు. దెబ్బతిన్న పొర్లుకట్టకు ఇరిగేషన్ అధికారులచే కొత్తకట్ట నిర్మాణ ప్రతిపాదనలు వేయిస్తామన్నారు. వరద ఎక్కువైతే లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డివో నాగసంతోషి అనూష, తహసీల్దార్ రమాదేవి,ఎంపీడీవో జలజాక్షి, డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌ఐ. శివరాకేష్, టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. కల్లేరు, పిన్నేరు వాగులు నిండుగా పారుతున్నాయి. అలాగే పొటేళ్ళ కాలువ జోరుగా ప్రవహిస్తుంది. దీనివలన కొమ్మలపూడి, ముద్దమూడి, చెరుకుమూడి గ్రామాలకు వెళ్లే రహదారికి అడ్డుగా నీళ్ళు రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆ గ్రామాల ప్రజలు మనుబోలు, గూడూరుకు వెళ్ళేందుకు వీలులేకుండా పోయింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని లక్ష్మీనరసింహపురం, కొలనుకుదురు గ్రామాల్లోని లోతట్టు గిరిజనకాలనీలను రెవెన్యూ, పోలీసు అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎస్‌ఐ. శివరాకేష్ విఆర్‌వోలు, కార్యదర్శులు, వైద్యఅధికారులు పాల్గొన్నారు.

కృష్ణపట్నం తీరంలో ఎగసిపడుతున్న అలలు

ముత్తుకూరు : కృష్ణపట్నం తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. ఆగకుండా కురుస్తున్న వర్షంతో తీర ప్రాంతం ఉలిక్కిపాటుకు గురవుతోంది. ముత్తుకూరులో బుధవారం 56.మి.మీ వర్షపాతం నమోదైంది. సముద్రతీరానికి చేరువైన గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహిస్తున్నారు. సముద్ర తీరానికి వచ్చే సందర్శకులు సముద్రంలోకి వెళ్లకుండా కృష్ణపట్నం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దారు స్వప్న, ఎంపీడీవో నాగమణి, కృష్ణపట్నం సీఐ రవినాయక్, ఎస్‌ఐలు శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌రెడ్డి తీర గ్రామాలను సందర్శించి వర్షాల నేపథ్యంలో ప్రజలకు అప్రమత్తత సూచనలు ఇచ్చారు.

కోన జలాశయంలో ప్రవేశానికి అనుమతి లేదు

రాపూరు: పెంచలకోన వారి దేవస్థానం పరిధిలో ఉన్న జలాశయం ప్రదేశానికి వెళ్లేందుకు ఎవరికి ఎటువంటి అనుమతులు లేవని ఎస్సై వెంకటరాజేష్ తెలిపారు. భారీ వర్షం కారణంగా వాటర్ ఫాల్స్ లో నీరు ఎక్కువగా ప్రవహించడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండడం వలన రాపూరు మండల పోలీస్ శాఖ అధికారులు వాటర్ ఫాల్స్ ప్రదేశం దగ్గరికి వెళ్లేందుకు అవకాశం లేకుండా తగు ఏర్పాట్లు చేశారు.

ఉలిక్కిపడ్డ గ్రామాలు

పొదలకూరు: కండలేరు జలాశయంలోని నీటిని స్పిల్ వే గేట్ల గుండా ఎత్తివేస్తారని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు సక్రమంగా లేకపోవడంతో వాగులు వంకలు పొంగి తమ గ్రామాలకు రాకపోకలు ఆగిపోతాయని మండలంలోని పర్వతాపురం, పర్వతాపురం ఎస్సీ కాలనీ, వెంకటాపురం, వామింటపర్తి గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పొదలకూరు తహసీల్దారు, రెవెన్యూ సిబ్బంది ద్వారా దండోరా వేయించినప్పటికీ వారిలో ఆందోళన తగ్గలేదు. చివరికి స్పిల్‌వే గేట్ల గుండా కాకుండా ఇతర కాలువల ద్వారా కండలేరు జలాశయంలోని నీటిని బయటకు వదలడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.

లోతట్టు ప్రాంతాల జలమయం

బుచ్చిరెడిపాళెం: మండలంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బుచ్చి పురపాలక సంఘంలోని మంగలికట్ట, శాంతినగర్, కామాక్షికాలనీ, దళితవాడతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని పెనుబల్లి దళితవాడలో వర్షంనీళ్లతో జలమయం కాగా కాలువలు పూడికతీతతో ఆ ప్రాంత ప్రజల అవస్థలు తొలిగాయి, మినగల్లు, కాళయకాగొల్లు, పంచేడు కట్టుబడిపాళెం, రామచంద్రాపురం ప్రాంతాల్లోని జగనన్నలేఔట్లు, సీజేఎఫ్ఎస్ కాలనీ, పురందరపురం. నాగాయగుంట ప్రాంతాల్లో వర్షంనీళ్ళతో వీధులు బరదమయంగా తయారయ్యాయి. బుచ్చి పురపాలక సంఘంలోని గుడపల్లికాలువ, మంగలికట్ట తదితర ప్రాంతాలను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి అధికారులు, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లతో కలిసి పర్యవేక్షించారు. చెల్లాయపాళెంలోని ప్రధాన మార్గం లోతట్టు ప్రాంతంలో మోకాటి లోతు నీళ్ళు ప్రవహిస్తున్నాయి.. దీంతో పిల్లలు కూడా బడికి పోలేని పరిస్థితి. నిలిచిన నీళ్ళతో రోడ్డుకు ఇరువైపులా వున్న నివాసాలు పూటెక్కి ఇంటి గోడలు దెబ్బతింటున్నాయని ఆ ప్రాంత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో బడికి వెళ్ళే పిల్లలకు సమస్యలేకుండా చూడాలని ఆ గ్రామానికి చెందిన మహిళలు నెల్లూరు కామేశ్వరి, ఆలపాక కామేశ్వరమ్మ, కదురు శారద, దండు సుధమ్మ, ఆడిపూడి శీనయ్య, నెల్లూరు రవి, సుబ్బయ్య ఆ ప్రాంతానికి చెందిన పలువురు కోరుతున్నారు.

భారీవర్షానికి అతలాకుతలం

కోవూరు : రెండు రోజులుగా కురుస్తోన్న భారీ వర్షానికి మండల పరిధిలోని జనజీవనం అతలాకుతలంగా మారింది. మండల పరిధిలోని మోడేగుంట, వేగూరు, గంగవరం, పాటూరు గ్రామాల్లోని లోతట్టు కాలనీలన్నీ జలమయమయ్యాయి. కోవూరులోని పూలతోట వీధి, సాయిని రామచంద్రారావు కాలనీ, పీఆర్ఆర్ కాలనీ , ఎన్ఎస్ఆర్ కాలనీలు వర్షపు నీటితో నిండిపోయాయి. పలు ప్రాంతాల్లో చేరిన వర్షపు నీటిని తొలగించేందుకు ఎక్స్‌కవేటర్లను ఉపయోగించి కాలువల్లో పూడిక తీయించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు లోతట్టు ప్రాంతాల్లో తిరిగి వర్షపు నీరు తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోలు రూమ్ ఏర్పాటుచేసినట్లు తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య వివరించారు. అవసరముంటేనే ఇళ్ళల్లో నుంచి వెలుపలికి రావాలని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఆయన రెవిన్యూసిబ్బందిని కోరారు. లోతట్టుప్రాంతాల్ని ఆయన సిబ్బందితో కలసి పరిశీలించి తగు సూచనలు చేశారు.

వెంకటాచలం : గిరిజనులకు అండగా తమ ప్రభుత్వం ఉందని సమస్యల పరిష్కారానికి అన్నివిధాలుగా తమవంతు కృషి చేస్తున్నామని జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ మల్లుగుంట సంఘం గిరిజన కాలనీని బుధవారం జనసేన నేతలు సందర్శించారు. భారీ వర్షాల దృష్ట్యా గిరిజనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.







బుచ్చి: వర్షపునీటిలో చెల్లాయపాళెం మహిళల కష్టాలు, వెంకటాచలం : సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జనసేన నేతలు, నిడిగుంటపాళెం కాలువలో గుర్రపుడెక్కను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం



సుప్రజ (ఫైల్)

మనుబోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయరహదారిపై కాగితాల పూరు క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండూరు సుప్రజ (40) మృతి చెందింది. బంధువుల కథనం మేరకు... మండలంలోని కాగితాలపూరు గ్రామానికి చెందిన కొండూరు వెంకటేశ్వర్లు, సుప్రజ భార్యభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. వెంకటేశ్వర్లు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సుప్రజ తల్లి స్వగ్రామం మండలంలోని గొట్లపాళెం. పనుల నిమిత్తం కుమారుడు రాకేష్‌తో కలిసి సుప్రజ మోటారుసైకిల్‌పై బుధవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గొట్లపాళెంకు వెళ్ళింది. అక్కడ పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో కాగితాలపూరుకు వస్తుండగా క్రాస్‌రోడ్డు వద్ద మలు పులో కృష్ణపట్నం పోర్టుకు వెళ్ళే ఓ ట్రక్కుఆటో మోటార్ సైకిల్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో రాకేష్, సుప్రజలు ఎగిరి రోడ్డుపై పడగా ఢీకొట్టిన వాహనమే సుప్రజ తలపై దూసుకెళ్ళింది. దీంతో సుప్రజ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. గుర్తుపట్టలేనంతగా తల నుజ్జు నుజ్జయింది. రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్‌ఐ శివరాకేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నెల్లూరు నడిబొడ్డున పేకాట కేంద్రం

● బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్, ఓ హెడ్‌కానిస్టేబుల్ సహా 18 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు



అరెస్టు చేసిన జూదరులతో సీఐ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర నడి బొడ్డునున్న ఓ హోటల్‌లో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై పోలీసులు దాడులు చేశారు. 18 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1.96 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన దేము నాయుడు బుధవారం నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు పక్కనే ఉన్న ఓ హోటల్‌లో గదిని అద్దెకు తీసుకున్నాడు. అందులో పేకాట నిర్వహించాడు. పోలీసు ఉన్నతాధికారులకు సమా చారం అందడంతో వారి ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సీతారామయ్య తన సిబ్బందితో కలిసి ఆ హోటల్‌పై దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు దేము నాయుడు, బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్, విడవలూరు పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పుల్లారెడ్డి, మరో 15 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1,96,400 నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని చిన్నబజారు పోలీసులకు అప్పగించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్యాయత్నం

● భర్త మృతి, చికిత్స పొందుతున్న భార్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వేణు

నెల్లూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ గుడిపల్లి పాడులో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ జంట ఆత్మహత్యకు యత్నించింది. భర్త మరణించగా భార్య ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సేకరించిన వివరాల మేరకు.. గుడిపల్లిపాడులోని చిన్నచెరుకూరు రోడ్డులో దేవిరెడ్డి మురళీరెడ్డి (56) కుటుంబం నివసిస్తోంది. ఆయన రైతుల వద్ద చేపలు కొనుగోలు చేసి చెన్నై, కేరళకు ఎగుమతి చేస్తుంటారు. ఈ వ్యాపారం అప్పుల పాలయ్యాడు. ఆ ఆర్థిక భారం మోయలేక మంగళవారం రాత్రి తన నివాసంలోని గదిలో భార్య జలజ (48)తో కలిసి గడ్డి మందు తాగారు. బుధవారం ఉదయం వారి కుమారుడు సాయి తలుపులు తీసి చూడగా వారి ద్దరు అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించి కేకలు వేశారు. సమా చారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మురళీరెడ్డి మృతి చెందినట్లు సీఐ వేణు తెలిపారు. జల జను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పా రు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మురళీరెడ్డి మృత దేహా న్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామన్నారు. ఈ ఘట న స్థానికులను దిగ్భ్రాంతికి గురి చేసింది.

వర్షాలకు కూలిన ఇల్లు

● ఇద్దరికి గాయాలు



కూలిన రేకుల ఇల్లు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా 54వ డివిజన్ జనార్ధనరెడ్డి కాలనీ పరిధిలోని అలీ నగర్‌లో ఓ ఇల్లు కూలింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి... స్థానిక అలీ నగర్‌లో షేక్ యస్దానీ కుటుంబం ఓ రేకుల ఇంట్లో నివసిస్తోంది. ఆయన కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి భార్య పర్వీన్‌తో కలసి నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా గోడలు, పైకప్పు కూలి వారిపై పడ్డాయి. దీంతో ఇరు వురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇంటిలోని సామాన్లు ధ్వంస మ య్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ జహీర్, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. మట్టి గోడలు కావడంతో వర్షాలకు బలహీ నపడి కూలినట్లు స్థానికులు భావిస్తున్నారు. నాయకులు ఈ విష యాన్ని నగర ఎమ్మెల్యే, మున్సిపల్ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని మంత్రి నారా యణ హామీ ఇచ్చినట్లు క్లస్టర్ ఇన్‌చార్జ్ జహీర్ తెలిపారు. కాగా, మంత్రి ఆదేశాల మేరకు బాధితులను స్థానిక కార్పొరేటర్ సాఫియా ముజీర్ పరామర్శించి, తక్షణ సాయంగా రూ.5 వేలు అందజేశారు.

జొన్నవాడ ఆలయ వంట స్వామి ఆకస్మిక మృతి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలోని వంటగది (మట్టుపల్లి)లో స్వామి, అమ్మవారికి నివేదనలు తయారు చేసే వంట స్వామి, ఆలయ ఉద్యోగి పారా రామ్మూర్తి (48) బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. బంధువులు ఆలయ ఈఓ వివరాల మేరకు... బుధవారం రాత్రి నెల్లూరులోని మెకానిక్ షెడ్డు వద్ద తన ద్విచక్ర వాహనం మరమ్మతులు చేయించుకుంటుంగా కుప్పకూలినట్లు బంధువులు తెలిపారు. వంటస్వామి ఆకస్మిక మృతి పట్ల ఆలయ ఈఓ, చైర్మన్, కమిటీ సభ్యులతోపాటు ఆలయ సిబ్బందితోపాటు భక్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	248

కోడిగుడ్ల ధర (100): 560



వేదగిరీశుడికి తిరుప్పావడ సేవ

నెల్లూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం వేదగిరి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామికి బుధవారం తిరుప్పావడ సేవ జరిగింది. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు, ప్రత్యే అలంకరణ జరిగాయి. అనంతరం తిరుప్పావడ సేవ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో, అర్చకులు పాల్గొన్నారు.



నగరంలోని ట్రంకురోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



ఆత్మకూరు బస్టాండ్ అండర్‌బ్రిడ్జిలో చేరిన వాన నీళ్లు



రామకోటయ్య నగర్ కూడలిలో ఛిద్రమైన రహదారి



తల్పగిరి కాలనీ సెంటర్‌లో ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు

ఎడతెరిపి లేని వర్షం

- నగరంలో జనజీవనం అస్తవ్యస్తం
- ఉద్యోగులు, చిరువ్యాపారుల అవస్థలు
- లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు
- విద్యుత్ అంతరాయంతో ఇక్కట్లు

నెల్లూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గత కొద్ది రోజులుగా వానలు దంచికొడుతున్నాయి. దీంతో రోడ్లు, కూడళ్లు, లోతట్టుప్రాంతాలు జలశయాలను తలపిస్తున్నాయి. దీనికితోడు భూగర్భంలోని డ్రైనేజీ నీరు బయటకు వస్తుండటంతో నగర వాసులు అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు బస్టాండ్, విజయ మహల్‌గేట్, మాగుంటలేవుట్, హరనాథపురం ప్రాంతాల్లోని అండర్ బ్రిడ్జిల వద్ద భారీగా వర్షపు నీరు చేరుతుంది. మున్సిపల్ యంత్రాంగం మోటార్లతో బయటకు తోడుతున్నా వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. నగరానికి ఆనుకుని ఉన్న విలీనప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో భారీగా వర్షపునీరు వచ్చి చేరుతుంది. ఖాళీస్థలాలు, కాలువలు, గుంతలు నిండు కుండల్లా మారాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తూనే ఉన్న వర్షం తాకిడికి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లలేక ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుమార్జిన్ వ్యాపారులు అమ్మకాలు సాగక అవస్థలు పడుతున్నారు. మద్రాసు బస్టాండ్, వీఆర్సీ, గాంధీబొమ్మ, కనకమహాల్, వేదాయపాళెం, కొండాయపాళెం, అయ్యప్పగుడి, బడ్వాడీ పాళెం, ఇరగాళమ్మ సంఘం, ములుముడి బస్టాండ్, సంతపేట మార్కెట్ కూడలి, స్టోన్‌హౌస్‌పేట ప్రాంతాలలోని జంక్షన్లు నీటమునిగాయి.నగర వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు.

- పెన్నా చెరువుల కరకట్టలు ఆందోళనకరం

వర్షాల తాకిడికి గ్రామాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నెల్లూరు చెరువు కిందున్న పొట్టేపాళెం కలుజు పై నుంచి 300 క్యూసెక్కులకుపైగా వరద ప్రవాహం ఉంది. దీంతో నెల్లూరు - జొన్నవాడ రహదారిపై వాహన ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇక్కడ పెన్నా పొర్లుకరకట్టలు ఆందోళనకరంగా ఉన్నాయనే సమాచారంతో తహసీల్దారు కృష్ణప్రసాద్ నేతృత్వంలోని యంత్రాంగం అప్రమత్తం అయింది. ములుముడి వద్ద కలుజుపై 250కు పైగా క్యూసెక్కుల ప్రవాహం ఉంది. దీంతో ద్విచక్ర వాహనాలు వెళ్లలేని స్థితి. కరకట్టలు పైనుంచి వరద ప్రవహించే అవకాశాలుండటంతో ఇసుక బస్తాలు వేసేందుకు జలవనరుల శాఖ సిద్ధమైంది. మండలంలోని సౌత్‌మోపూరు, ములుముడి గ్రామాల్లోని చేనేత కార్మికుల నివాసాల్లోని వర్షపునీరు చేరింది. దీంతో 200 కుటుంబాలు పనికి దూరమయ్యాయి. నారాయణరెడ్డిపేటలోని 300 కుటుంబాల్లోని మగ్గాలు తడిసి పనిలేక చేనేతలు నిలిచిపోయారు. సౌత్‌మోపూరు పంచాయతీ శ్రీరామ గిరిజన కాలనీ వద్ద వర్షపునీరు చేరుకోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రజలకు అండగా ఉండండి : గిరిధర్‌రెడ్డి

భారీ వర్షాల నేపథ్యంలో పార్టీ శ్రేణులంతా ప్రజలకు అండగా ఉండాలని టీడీపీ సీనియర్ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని 19, 20, 23,25 డివిజన్లలో అధికారులు, పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆయన లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వర్షాలు మరింతగా పడే అవకాశం ఉన్నందున ఇబ్బందులు తలెత్తే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలించాలన్నారు. అనంతరం మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జి వద్ద రూ. 13.50 లక్షలతో ఫుట్‌పాత్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.



ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో దెబ్బతిన్న రహదారి



ములుముడి కలుజు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద ప్రవాహం



బుజబుజ నెల్లూరు ప్రాంతంలో ఇళ్ల చుట్టూ చేరిన వర్షపునీరు, ఆకాశంలో కమ్ముకున్న వాన మబ్బులు



ములుముడి చెరువు కరకట్టకి ఇసుక బస్తాలేస్తున్న కూలీ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశునష్టం జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు.

సహాయక చర్యల్లో పాల్గొనండి

- టీడీపీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ సూచన

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తక్షణమే ప్రజల మధ్యకు వెళ్లి సహాయక, పునరావాస చర్యల్లో పాల్గొనాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పిలుపునిచ్చారు. వర్షాల కారణంగా ఇళ్లలో నీరు చేరిన కుటుంబాలకు ఆహారం, తాగునీరు, మందులు తదితరాలు అందించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.

అవసరమైతే తప్ప బయటకు రావొద్దు



నెల్లూరు(స్టోన్ హౌస్‌పేట), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసైనికులు ప్రజలకు అందుబాటులో ఉం టూ సహాయక సేవలు అందించాలని కోరారు. రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జిల్లాలో ఆరోగ్య సేవలను మెరుగు పరచాలని, వర దల నేపథ్యంలో పీహెచ్‌సీలలో మెరుగైన వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కందుకూరు లక్ష్మీనాయుడు హత్య కిరాతకమైన చర్య అని దాన్ని కులాలకు, పార్టీలకు అపాదించడం అంతర్గత కుట్రే అన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరా మ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో నేలకూలిన చెట్లు



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చెట్లు నేలకూలాయి. వాటిని బుధవారం అధికారులు తొలగించారు. జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు పర్యవేక్షణలో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చెట్లను తొలగించారు.

వర్షపు నీటి తొలగింపు

నగరంలోని గుప్తాపార్కులో భారీగి నిలిచిన వర్షపు నీటిని బుధవారం తొలగించారు. తెలుగుదేశం పార్టీ 47వ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ గల్పర్ మిషన్ సహాయంతో వర్షపు నీటిని తొలగించారు. భాస్కర్, కంచికృష్ణ, షేక్ మాబాషా, మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కోవూరు నియోజకవర్గ ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఓ ప్రకటనలో సూచించారు. సోమశిల జలాశయ నీటి విడుదల దృష్ట్యా పెన్నా కరకట్టల పటిష్టతపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. మైపాడు, గంగపట్నం రామతీర్థంలోని తుఫాన్ షెల్టర్లను సిద్ధం చేయాలన్నారు.

పోరంబోకు స్థలాల్లో నిర్మాణాల తొలగింపు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను కార్పొరేషన్ సిటీ ప్లానింగ్ అధికారులు తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా హరనాథపురం వద్ద కాలువ పోరంబోకు స్థలంలో నిర్మించిన అనేక కట్టడాలను బుధవారం నేలమట్టం చేశారు. బీవీనగర్‌లోనూ ఇంటి ముందు న్న ర్యాంపులను తొలగించారు. 46వ డివిజన్ ముత్తరాజువారి వీధిలో శిథి లావస్థలో ఉన్న ప్రహరీని నేలమట్టం చేశారు. నగర వ్యాప్తంగా జోరు వర్షా నికి లోతట్టు ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, రహదారులు, రోడ్లు, తాగునీటి పైపు లైన్లు, డ్రైనేజీ ప్రవాహ ప్రాంతాలను కమిషనర్ నందన్, ఎస్ఈ రామ్మోహన్‌రావు పరిశీలించి తగు నివారణ చర్యలకు ఆదేశాలిచ్చారు.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం



ఆదిశంకర ధ్యాన మందిరంలో విశేష అలంకరణ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆలయాల్లో బుధవారం కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. శివాలయాల్లో ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం కార్తీక దీపోత్సవం మొదలైంది. ఈ సందర్భంగా ఆకాశ దీపాలు వెలిగించారు. రాజరాజేశ్వరి ఆలయంలోని మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు సూరావఝ్ఝల రఘురామమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు, ఉభయకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు విశేష పూజలు నిర్వహించి ఆకాశ దీపాన్ని ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ చక్కా అహల్య, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి సతీమణి సుజితమ్మ, ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ పాల్గొన్నారు.

- పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. పవని అనిల్ కుమార్ శర్మ, అద్దేపల్లి రవీంద్రశర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, శివపంచాయతన పూజలు జరిగాయి. మందిరం కమిటీ అధ్యక్షుడు గుండాపంతుల రామసుబ్రహ్మణ్యంశర్మ, మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, సమయానంద నాథ, గుండాపంతుల ప్రత్యూష, చక్రాల నాగరత్నకుమారి పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి ఆలయంలో
కార్తీకమాసం పూజలు చేస్తున్న సుజితమ్మ, అర్చకులు

స్వాతంత్రోద్యమ చరిత్ర తెలుసుకోవాలి

- అవాజ్ జిల్లా కమిటీ కార్యదర్శి షేక్ రషీద్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్రోద్యమ చరిత్రను నేటి యువత తెలుసుకోవాలని అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధుడు అష్ఫాఖుల్లా ఖాన్ 125వ జయంతి నిర్వహిం చారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రషీద్ మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు, ఇంటర్నెట్‌కు బానిసలువు తున్నారన్నారు. వారు సామాజిక సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరా టంలో అష్ఫాఖుల్లా ఖాన్ వంటి వారి బలిదానాల గురించి యువత తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అవాజ్ నగర కార్యదర్శి షేక్ రియా జ్, ఐద్వా నాయకులు రెహినుమా, డీవైఎఫ్ఐ నగర అధ్యక్షుడు జగదీష్ శ్రీనివాసులు, యశ్వంత్, సుమంత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అష్ఫాఖుల్లా ఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

26న పుంజుతోక కవితా సంపుటి ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు కొత్తకోట శ్రీనివాసరెడ్డి రచించిన కవితా సంపుటి పుంజుతోక ఆవిష్కరణ సభ ఈనెల 26న జరుగుతుందని సాహితీ మిత్రమండలి ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమం నగరంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరంలో సాయంత్రం 6గంటలకు జరుగుతుందని, శతాధిక గ్రంథకర్త సాహితీ సింధు డాక్టర్ జీవీ పూర్ణచంద్ ఆవిష్కరిస్తారని పేర్కొంది. సాహితీప్రియులు హాజరుకావాలని మిత్రమండలి కోరారు.

హాస్టళ్లలో విజిలెన్స్ కమిటీ సభ్యుడి తనిఖీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లను బుధవారం జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు, బీసీ విద్యార్థి యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఉల్లిపాయల మురళీ కృష్ణ యాదవ్ ఆకస్మి కంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు సంగీత, మాధవి, ముంతాజ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మురళీకృష్ణ

స్మార్ట్ స్ట్రీట్ బజార్‌లో మంత్రి నారాయణ ఆకస్మిక తనిఖీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మైపాడు గేట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ బజారును రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణ, ఆయన కుమార్తె శరణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహిళా వ్యాపారులతో బాగోగులు తెలుసుకున్నారు. ఓ దుకాణంలో శరణి చీర కొనుగోలు చేశారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్యనాయుడు కుటుంబానికి సాయం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు నియోజకవర్గం దారకనిపాడులో దారుణహత్యకు గురైన లక్ష్మయ్యనాయుడు కుటుంబానికి బుధవారం బలిజ సేవా ఫౌండేషన్ రూ.50వేలు సాయం అందజేసింది. ఆయన కుమారులిద్దరికి భవిష్య నిధిగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ చిన్నారుల కోసం బలిజ సేవా ఫౌండేషన్ రూ. 10 వేలు, డాక్టర్ పోకల రవి రూ.11వేలు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి పత్రాలను లక్ష్మయ్య నాయుడు భార్య సుజాతకు అందజేశారు. ఈ సేవింగ్స్ పథకానికి 15 ఏళ్ల నగదు చెల్లించేందుకు ముందుకు వచ్చిన సుజాత కృతజ్ఞతలు తెలిపారు.



రూ.50వేలు చెక్కు అందజేస్తున్న డాక్టర్ రవి, బలిజ సేవా ఫౌండేషన్ సభ్యులు

వెంగమాంబ ఆలయ అభివృద్ధికి
రూ.10 కోట్లతో ప్రతిపాదనలు : మంత్రి ఆనం

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ పరిసరాలను పరిశీలించారు. తొలుత వారికి ఆలయ అర్చకులు, కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురాతన చరిత్ర గల వెంగమాంబ ఆలయాన్ని ప్రభుత్వం, దాతల సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. ఒక మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణం, శాశ్విత కట్టడాలు, రాజగోపురాల ఏర్పాటు తదితర నిర్మాణాలకు దేవదాయ శాఖ ఇంజనీర్లు, స్థపతులు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. ఆలయ పరిసరాల్లో రెవెన్యూ భూములను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ వెంగమాంబతోపాటు సీతారామపురం మండలంలో గల శైవక్షేత్రమైన ఘటికసిద్ధేశ్వరం, ఉదయగిరి రంగనాయకులస్వామి ఆలయం, ఉదయగిరి దుర్గంను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబుయాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, దేవదాయ శాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్‌ఆజాద్, అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి, టీడీపీ నాయకులు మల్లంపాటి గురవయ్యనాయుడు, ఉండేలా గురవారెడ్డి, కూటమి నాయకులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వెంగమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కాకర్ల, అధికారులు

ఎస్‌ఈఐఎల్ ఎనర్జీకి ఉత్తమ సామాజిక సేవా సంస్థ అవార్డు
● ఒకే వేదికపై 12 అవార్డులు

ముత్తుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రమైన ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ నాణ్యత, నాయకత్వం, సామాజిక సేవల విభాగాల్లో అత్యుత్తమ గుర్తింపును సొంతం చేసుకుంది. తిరుపతిలో బుధవారం క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా నిర్వహించిన చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్‌లో ప్రతిష్ఠాత్మకమైన ఉత్తమ సామాజిక సేవా సంస్థ అవార్డుతో సహా మొత్తం 12 అవార్డులను కంపెనీ కైవశం చేసుకుంది. 'వికసిత్ భారత్ కోసం ఆత్మనిర్భర్' అనే అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. కంపెనీ తరఫున సీఎస్‌ఆర్ హెడ్ ఆల్బర్ట్ డేవిడ్ పీటర్ ఉత్తమ సామాజిక సేవా సంస్థ అవార్డును అందుకున్నారు. కంపెనీ కార్యకలాపాలు, నిర్వహణ అధిపతి సునీల్‌కుమార్ గుప్తాను లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించారు. కంపెనీలోని ఐదుగురు కైజెన్‌లు బెస్ట్ 5ఎస్ కైజెన్స్ కేటగిరీ గోల్డ్ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈవో జనమేజయ మహాపాత్ర అవార్డులు పొందిన తమ బృందాన్ని అభినందించారు. ప్రజల అభిరుచి, నాణ్యత, భద్రత, సామాజిక ప్రభావంలో ఎస్‌ఈఐఎల్ ఎనర్జీని ఒక ప్రమాణంగా మార్చాలనే నిబద్ధతకు ఈ అవార్డులు ప్రతీకలుగా నిలిచాయన్నారు. సమాజం పట్ల బాధ్యతతో స్థిరమైన పురోగతి సాధ్యమవుతుందనే తమ నమ్మకాన్ని ఈ గుర్తింపు బలోపేతం చేస్తుందన్నారు. ఇంధన రంగంలో అగ్రగామిగా కంపెనీ సాధించిన విజయాలే నిదర్శనమన్నారు.



అవార్డులు అందుకుంటున్న ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ప్రతినిధులు

ఎగసి పడుతున్న అలలు.. ముందుకొస్తున్న సముద్రం


తుమ్మలపెంట వద్ద సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

కావలి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి) దక్షిణమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కావలి రూరల్ మండలం తుమ్మలపెంట తీరంలో బుధవారం సాయంత్రం సముద్రంలో అలలు ఎగసిపడుతూ అలజడి సృష్టించాయి. సముద్రం ముందుకు వస్తూ తీరం కోతకు గురౌతుండటంతో మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. తీరం వెంబడి లోతట్టు ప్రాంతంలో ఉన్న తమ పడవలు, వలలను సురక్షిత ప్రాంతాలకు చేర్చుకుంటున్నారు. పెద్ద పెద్ద బోట్లను ట్రాక్టర్లతో ఎత్తు ప్రదేశాలకు లాగించి సురక్షితంగా ఉంచారు. అల్పపీడనం కారణంగా ప్రమాద తీవ్రత దృష్ట్యా మెరైన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా, సముద్రం వైపు ఎవరూ రాకుండా తీరం వద్ద నిఘా ఉంచారు.

వక్ఫ్ ఆస్తులు దేవుడివి... !
● రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ ఆస్తులు దేవుడి ఆస్తులని, అవి ముత్తవల్లీల ఆస్తులు కావని రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. బుధవారం రాష్ట్రంలోని ముత్తవల్లీలు, వక్ఫ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వక్ఫ్ ఆస్తులకు ముత్తవల్లీలు మేనేజర్లు మాత్రమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆక్రమణలో ఉన్న వక్ఫ్ ఆస్తులు 700 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విశాఖపట్నంలో 319 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని, కర్నూలులో వక్ఫ్ ఆస్తుల అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయించామని చెప్పారు. ఆస్తులు కాపాడటంలో ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగిస్తే ఏ చట్టం వర్తిస్తోందో అదేచట్టం ముత్తవల్లీలకూ వర్తిస్తుందని, ముత్తవల్లీలు ధైర్యంగా వక్ఫ్ ఆస్తులు కాపాడాలని కోరారు. వక్ఫ్‌బోర్డు ఆదాయం పెంచి వాటిని పేద ముస్లింల సంక్షేమానికి వినియోగిస్తామని పేర్కొన్నారు. త్వరలో తాలింఏహునర్ పేరుతో కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రతిభ కలిగిన ముస్లిం విద్యార్థులు 500 మందికి వచ్చే విద్యా సంవత్సరం ఉచితంగా ఇంటర్ విద్య అందించబోతున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు సభ్యుడు బేపారి జాకీర్ అహ్మద్, సీఈవో జాకీర్ అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో గురువారం నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ సీహెక్ బయ్యన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8143227239, 9988853335 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

29న సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సివిల్ సర్వీసు ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక ఈనెల 29వతేదీన నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 29న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలు, నెల్లూరు క్లబ్‌లో లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 30న ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్‌ప్లే పోటీలుంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఉద్యోగులు తాము ప్రస్తుతం విధులు నిర్వహించే కార్యాలయం అధికారి నుంచి పొందిన లేఖతో సంబంధిత తేదీల్లో క్రీడా దుస్తులతో హాజరుకావాలని కోరారు. పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన ఉద్యోగులు విజయవాడ, గుంటూరులో నవంబరు 5 నుంచి 8వతేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడాపోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపితే జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారని, పూర్తి వివరాలకు డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

30న జడ్పీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 30న ఉదయం 10.30 గంటల నుంచి జడ్పీ సమావేశమందిరంలో సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. వ్యవసాయ, నీటిపారుదల, వైద్య, ఆరోగ్య, సాంఘిక సంక్షేమ, ఆర్‌అండ్‌బీ శాఖలపై సమీక్ష ఉంటుందన్నారు. సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

లంకా దినకర్ పర్యటన వాయిదా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 20 సూత్రాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ జిల్లా పర్యటన వాయిదా పడింది. ఆయన గురువారం నెల్లూరులో నిర్వహించాల్సిన సమావేశం వాతావరణ పరిస్థితుల కారణంగా వాయిదా పడిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24వ తేదీ జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జోయలుక్కాస్ జ్యూయలరీ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపికలు జరుగుతాయని, 18 నుంచి 30 సంవత్సరాల వయసు వారు అర్హులని తెలిపారు. ఇంటర్, డిప్లమో, డిగ్రీ విద్యార్హత కలిగిన వారు ఎంపికలకు హాజరు కావచ్చని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.22 వేల జీతం, ఇన్సెంటివ్ ఇస్తారని పేర్కొన్నారు. సీఎంఆర్ ఎన్‌ఎల్‌ఎం ఈసీవో అల్యూమినియమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఎలక్ట్రీషియన్, మెకానికల్, ఎఫ్‌ఎల్‌టీ డ్రైవర్స్, ఆపరేటర్స్ పోస్టులకు ఎంపికలు జరుగుతాయని 18-35 సంవత్సరాలలోపు వయసు వారు అర్హులని తెలిపారు. ఐటీఐ ఫిట్టర్, బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమెస్ట్రీ డిగ్రీ పూర్తి చేసిన వారు ఎంపికలకు హాజరు కావచ్చన్నారు. నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకు ముందస్తు బెయిల్

నెల్లూరు (లీగల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నాయకుడు కరకటి మల్లికార్జునపై దాడి, హత్యాయత్నం కేసులో కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, మరో 13 మందికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు 3వ అదనపు జిల్లా జడ్జి యల్ తేజోవతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొడవలూరు పోలీసులు నమోదు చేసిన ఈ కేసులో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతి తోపాటు బొమ్మ దాసు, అనపల్లి ఉదయ భాస్కర్, వీరి సురేష్, పానేటి శ్రీకాంత్ ఇప్పటికే జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. వారికి కూడా బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు.

వలలు, తెప్పలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం నేపథ్యంలో సముద్రంలో చేపల వేట నిలుపుదల హెచ్చరికలు జారీ అయ్యాయని, మత్స్యకారులు వలలు, తెప్పలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మత్స్యశాఖ జేడీ శాంతి ఓ ప్రకటనలో కోరారు. పెద్ద బోట్లను కృష్ణపట్నం, జువ్వలదిన్నె హార్బర్లలో నిలుపుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు సాగర మిత్ర, గ్రామ మత్స్య సహాయకులు, రెవెన్యూ, మెరైన్ పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. ఈ వాతావరణానికి చేపలు, రొయ్యల్లో ఆకలి మందగిస్తుందని, సాగుదారులు దాణా తగ్గించాలని సూచించారు. రొయ్యల చెరువుల్లో ఏరేటర్లు వాడాలని, జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలని, రొయ్యలు కాస్త పెద్ద సైజులో ఉంటే పాక్షికంగా పట్టుకోవడం మంచిదని తెలిపారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలు : నష్ట నివారణ చర్యలు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న తుఫాల వర్షాల కారణంగా వివిధ పంటలు దెబ్బతిన్నాయి. అయితే రైతులు వెంటనే నష్ట నివారణా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్న రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.లోకేష్‌బాబు ఆంధ్రజ్యోతి ద్వారా పలు సూచనలు తెలియచేశారు.

● వేరుశనగ

పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని వీలైనంత త్వరగా తీసేయాలి. ఆకుమచ్చ తెగులును నియంత్రించేందుకు ఎకరాకు టెబుకోనజోల్ 200మి.లీ లేదంటే హెక్సాకొనజోల్ 400మి.లీ డ్రోన్ ద్వారా అయితే 10లీటర్ల నీరు, స్ప్రేయర్ల ద్వారా అయితే 200లీటర్ల నీటితో పిచికారీ చేయాలి. ఐరన్ లోపాన్ని సరిచేసుకునేందుకు ఫెర్రస్ సల్ఫేట్ 5గ్రాములు లీటరు నీటితో పాటుగా సిట్రిక్ యాసిడ్ 1గ్రాము లీటరు నీటితో పిచికారీ చేయాలి. పంట కోతకు సిద్ధంగా ఉంటే వర్షాలు ఆగే వరకు పంట కోత ఆలస్యం చేయాలి.

● మొక్కజొన్న

మొక్కజొన్న పంట 70 నుంచి 90రోజుల వయసులో పూత, గింజ గట్టిపడే దశలో ఉంటుంది. ఈసమయంలో పలంలో నీరు నిలిచిపోతే తప్పనిసరిగా 48గంటల్లోపు తొలగించాలి. నీరు ఎక్కువసేపు నిలిచిపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుంది. నీటిని తొలగించిన తరువాత పంట త్వరగా కోలుకునేందుకు 2 శాతం యూరియా(10కిలోలు/హెక్టారుకు), లేదంటే 1శాతం పొటాషియం నైట్రేట్(5కిలోలు/హెక్టారుకు) పిచికారీ చేయడం మంచిది. నీటి ముంపు, అధిక తేమ వాతావరణం వల్ల కాండం/వేరు కుళ్ళు తెగులు, గింజ బూజు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. వాటి నియంత్రణకు కార్బెండజిం 2-3గ్రాములు లేదంటే మెటాలాక్సిల్ 35శాతం డబ్ల్యుఎస్ 2గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.


అనంతసాగరం మండలం ఉప్పలపాడులో వర్షాలకు నేలవాలిన వరిపైరు

● ధాన్యం మొలకెత్తకుండా..

జిల్లాలో కోత దశలోఉన్న వరిపైరు బాగా తడిసిపోయి వాలిపోయి ఉంది. పరిస్థితులను బట్టి పడిపోయిన చేలలో వీలైనంత తొందరగా దుబ్బలను నిలబెట్టి కట్టలుగా కట్టి నష్ట నివారణ చర్యలు చేపట్టాలి.ధాన్యం మొలకెత్తకుండా ఉండేందుకు 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. కోత కోసిన పనలు పొలంలో ఉంటే వాటిని గట్లపైకి తెచ్చుకుని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించవచ్చు. నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండ బెట్టడానికి వీలుకాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తడమే కాకుండా రంగుమారి చెడు వాసన వస్తుంది. ఈ పరిస్థితుల్లో నష్టాన్ని నివారించేందుకు క్వింటాలు ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక లేదంటే వరిగడ్డి కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తి చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండకాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి, తూర్పారబెట్టి నిల్వ చేసుకోవాలి. రంగు మారి తడిచిన ధాన్యాన్ని పచ్చి బియ్యంకంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని తగ్గించుకోవచ్చు.


లోకేష్‌బాబు

పరమశివుని పాదాలు తాకుతూ ప్రవహిస్తున్న గంగమ్మ

సీతారామపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోనలోని జలపాతం కనువిందు చేస్తోంది. కార్తీక మాసం ప్రారంభం కావడం, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతంలో నుంచి నీరు వచ్చి పడటంతో చుట్టుపక్కల గ్రామాల భక్తులు జలపాతాన్ని తిలకించేందుకు, త్రిముఖ దుర్గాదేవిని, పరమశివుని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. అయితే నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి, హెచ్చరికలు జారీ చేశారు. కాగా, వర్షాలకు భైరవకోన ప్రాంతంలోని కుంటలకు, చెరువులకు నీరు భారీగా వచ్చి చేరుతోంది.



భైరవకోనలో శివుని పాదాలు తాకుతూ ప్రవహిస్తున్న గంగమ్మ, కనువిందు చేస్తున్న జలపాతం

ఏనాడైనా 1వ తేదీ జీతాలిచ్చారా..?

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో ఏనాడూ ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు ఇచ్చిన చరిత్ర లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి వెల్లడించారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగుల డీఏ బకాయిలపై వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉద్యోగులకు దీపావళి కానుకగా ఒక డీఏను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని, బకాయిలను వాయిదాలలో చెల్లిస్తుందని చెప్పారు. దీనిపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తుంటే, ఎమ్మెల్సీ విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ పాలనలో ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏను తగ్గించటంతోపాటు పెన్షనర్స్ అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ కూడా 10 శాతం నుంచి 7 శాతానికి తగ్గించారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ నాడు ఎందుకు ప్రశ్నించలేదని దుయ్యబట్టారు. అర్హత లేని వారిని ఉపాధ్యాయ ఓటర్లుగా నమోదు చేయించి గెలిచిన మీకు ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన ఎలా ఉంటుందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశం లో ఉపాధ్యాయ నాయకులు హజరత్తయ్య, బంగారయ్య, తెలుగు యువత నాయకులు కృష్ణమోహన్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి

తల్లికి తనయ అంత్యక్రియలు

సంగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లికి తనయ అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన మండల కేంద్రమైన సంగంలో బుధవారం జరిగింది.వివరాల మేరకు గ్రామానికి చెందిన పెరుమాళ్ల గోపి, ఆదిలక్ష్మి దంపతులు. వీరికి కుమార్తె భార్గవి ఒక్కటే సంతానం. స్థానిక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కాగా, కరోనా సమయంలో తండ్రి గోపి మృతిచెందగా నాడు అతనికి కుమార్తె భార్గవి అంత్యక్రియలు నిర్వహించింది. మంగళవారం తల్లి ఆదిలక్ష్మి గుండెపోటుతో మృతిచెందడంతో బుధవారం భార్గవి పెద్దల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించింది. తండ్రి, తల్లి ఇద్దరికీ తనయ అంత్యక్రియలు నిర్వహించడం గమనార్హం.


తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె భార్గవి

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కావలి,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కావలి మున్సిపల్ కార్యాలయంవద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంపై నవంబరు 3వ తేదీన పెద్దఎత్తున సమ్మె చేస్తున్నామన్నారు. మున్సిపాల్టీలోని పారిశుధ్య, ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్ట్ తదితర విభాగాలకు చెందిన కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వై. ఆదినారాయణ, టీ. వెంకటేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లె అంకయ్య, సీపీఐ నాయకులు దమ్ము దర్గాబాబు, ఎం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, యూనియన్ నాయకులు

మూలస్థానేశ్వరాలయంలో ఆకాశదీపం ఏర్పాటు


మూలస్థానేశ్వరాలయంలో ఆకాశదీపం ఎగురవేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో బుధవారం రాత్రి ఆకాశదీపాన్ని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చారు. ఆలయ ఈవో ఆర్‌వీ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. మూలస్థానేశ్వరస్వామికి, భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపానికి పూజలు చేసి ఎగురవేశారు. దీంతో ఆలయంలో కార్తీక మాసం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి తోటలో అఖండ దీపారాధన జరిగింది. తదుపరి మూలస్థానేశ్వరస్వామికి భువనేశ్వరి అమ్మవారికి పేట ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలను ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ ముఖ్య అర్చకులు వందవాశి శివకుమార్, సిబ్బంది పర్యవేక్షించారు. కార్తీక మాసోత్సవాలు, భక్తులకు సౌకర్యంగా నిర్వహించేందుకు గురువారం ఉదయం 10గంటలకు అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఆర్డీవో అధ్యక్షతన జరుగుతుందన్నారు.


స్వామి, అమ్మవార్ల పేట ఉత్సవం

అరుణాచలానికి ఆర్టీసీ సర్వీసు

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో అరుణాచలం దర్శించుకునే భక్తుల కోసం సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతామని డీఎం శివకేశ్‌యాదవ్ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఆత్మకూరు నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. భక్తులు కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, కంచి, తిరుత్తిణి, కాళహస్తి దర్శించి అరుణాచలంలో గిరి ప్రదర్శన, దైవ దర్శనం చేసుకుని తిరిగి బయలుదేరవచ్చని తెలిపారు.

పాలవల్లికి పలువురి నివాళులు

కావలి (టౌన్) అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డికి ప్రధాన అనుచరుడు పాలవల్లి పద్మనాభరెడ్డికి బుధవారం పలువురు నివాళులర్పించారు. జనతాపేట పెద్దపవని రోడ్డు వద్దనున్న పాలవల్లి నివాసం వద్ద మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో నియోజకవర్గ పరిధిలోని పలు పార్టీల నాయకులు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని పాలవల్లి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మంచివాడు, మృదుస్వభావి అయిన పాలవల్లి మృతి తనకు వ్యక్తిగతంగా తీరని లోటని ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ పీ. అలేఖ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎం సుకుమార్ రెడ్డి, విజయ డెయిరీ మాజీ చైర్మన్ సుధీర్ రెడ్డి, బాలకృష్ణంరాజు, కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

తిరుమలాపురం పంచాయతీని విభజించండి

ఉదయగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం పంచాయతీని విభజించాలని దుంపవారిపల్లి గ్రామస్థులు, ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులు బుధవారం ఎంపీడీవో బీశ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులచే అత్యవసర గ్రామసభ నిర్వహించాలన్నారు. దుంపవారిపల్లి గ్రామం, ఎస్సీ, ఎస్టీ కాలనీలను కలుపుతూ నూతనంగా దుంపవారిపల్లి పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11847
వెండి కిలో ధర	రూ. 158300
వెండి ఒక గ్రాము	రూ. 164.30


ఆత్మకూరు: ముస్లిం కాలనీని చుట్టుముట్టిన వర్షపునీరు


చేజర్ల మండలం నల్లవాగు వద్ద పర్యవేక్షిస్తున్న ఆర్డీవో పావని


సంగం: బీరాపేరు అలుగును పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్‌ఐ

భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల జలమయం

- జనజీవనం అస్తవ్యస్తం
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- రాకపోకలకు అంతరాయం

ఆత్మకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెం ఎస్సీ కాలనీ, ముస్లిం కాలనీల్లో భారీగా వర్షపునీరు చేరాయి. దీంతో మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకుడు చెరుకూరు తిరుపతినాయుడు తదితరులు సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో వర్షపునీటిని తొలిగించారు. వీవర్స్ కాలనీ, పేరారెడ్డిపల్లి బీసీ కాలనీ, జెఆర్‌పేట, సుందర్‌నగర్ పలు ప్రాంతాల్లో వర్షపునీరు ఇళ్లల్లోకి రావడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. మండలంలోని బట్టేపాడు ఎస్సీ కాలనీలోకి భారీగా వర్షపునీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు వెంటనే స్పందించి జేసీబీ సహాయంతో వర్షపునీటిని తొలిగించే ఏర్పాట్లు చేశారు. అలాగే వర్షాలకు ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు ప్రధాన రహదారిపై పలు చోట్ల భారీగా గుంతలు పడ్డాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

కురుస్తున్న వర్షాలకు పలు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. అనంతసాగరం మండలం ముత్తుకూరు వద్ద వాగు ప్రమాదభరితంగా పారుతుండడంతో పోలీసులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మర్రిపాడు మండలంలో నాయుడుపల్లి వద్ద కేతామన్నేరు వాగు, సన్నవారిపల్లి, పెగళ్లపాడు వద్ద బొగ్గేరు రహదారుల బ్రిడ్జిలపై నీరు పొంగిపొర్లుతుండడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ఏఎస్‌పేట మండలంలో నక్కలవాగు, కలుజువాగు పొంగిపొర్లుతుండడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. చేజర్ల మండలంలోని తూర్పుకంభంపాడు సమీపంలో నల్లవాగు, కాకివాయి వద్ద పెద్దవాగు ప్రవాహంతో చేజర్ల, కలువాయి మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈనేపథ్యంలో ఆర్డీవో బి పావని చేజర్ల మండలంలోని నల్లవాగును పరిశీలించి సురక్షిత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

● **సంగం:** మండలంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో రాకపోకలకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉండడంతో బుధవారం తహసీల్దారు సోమ్లానాయక్, ఎస్‌ఐ రాజేష్ అలుగులు, లోతట్టు కాలనీల్లో పర్యటించారు. అందులో భాగంగా పెరమన వద్ద బీరాపేరు అలుగు, చెన్నవరపాడు వద్ద చవిటివాగు, దువ్వూరు చెరువు అలుగులను పరిశీలించారు. ఒకవేళ అలుగులు ప్రవహిస్తే ఆయా గ్రామాల రాకపోకల విషయంలో ప్రజలను అప్రమత్తం చేశారు. అదేవిధంగా పెన్నానదికి భారీ పరిమాణంలో నీరు వస్తే ముంపునకు గురయ్యే కోలగట్ల ఎస్సీ కాలనీ, వీర్లగుడిపాడు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. అలుగుల్లో నీటి ప్రవాహం ఉంటే దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు సూచించారు.

వరద ప్రవాహంతో స్తంభించిన రాకపోకలు

● **అనంతసాగరం:** మండలంలో భారీవర్షం కారణంగా ముత్తుకూరు వద్ద వంక ప్రవాహం అధికంగా కొనసాగింది. దీంతో ఆత్మకూరు-సోమశిల రాకపోకలు స్తంభించాయి. కొమ్మలేరు, కేతామన్నేరు, పల్లవోలు వాగుల్లో ప్రవాహం అధికంగా కొనసాగుతోంది. దీంతో పోలీసులు వాగుల వద్ద పహారా కాస్తున్నారు. రేవూరు ఎస్సీకాలనీకి వరద చుట్టుముట్టడంతో ఇళ్లలోకి నీరు చేరుతుండగా సమాచారం తెలుసుకొన్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి రమణరావు, వీఆర్వో అక్కడకు చేరుకొని ఎక్స్‌కవేటర్‌తో కాలువలు శుభ్రం చేయించి కాలనీలోకి నీరు చేరకుండా చర్యలు చేపట్టారు.

● **ఏఎస్ పేట :** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఏఎస్ పేటలోని షాపబావీ సెంటర్, ఆనకట్ట వీధిలో వర్షం నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. బస్టాండ్ సెంటర్‌లో నీరు రోడ్డు మీద పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చాకలి వీధి, ఎస్‌టికాలని తదితర ప్రాంతాలలో వర్షం నీరు ఇళ్లలోకి చేరాయి.

● **ఉదయగిరి :** బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో గత కొన్నిరోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఆయా మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. రోజంతా ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో జనజీవనం స్తంభించింది. దుత్తలూరు పంచాయతీ పరిధిలోని ముత్తరాశిపల్లి గ్రామం వద్ద గూబల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాఘవరెడ్డిపల్లి, రాచవారిపల్లి, తురకపల్లి, జంగాలపల్లి, భైరవరం గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. తహసీల్దారు యనమల నాగరాజు వాగును పరిశీలించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. అలాగే ఏరుకొల్లు పంచాయతీ కమ్మవారిపల్లి గ్రామ సమీపంలో వరద ప్రవాహం రోడ్డుపైకి రావడంతో రాకపోకలు స్తంభించాయి. పలు గ్రామాల్లో చెక్‌డ్యామ్‌ల్లో జలకళ సంతరించుకుంది.

● **వరికుంటపాడు:** అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాగులు, వంకల్లోకి వరద నీరు చేరడంతో జలకళను సంతరించుకున్నాయి. జీ.కొత్తపల్లి సమీపంలో వేరుశనగ, సజ్జ పంటలు నీట మునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగులో ఉన్న పంటతో పాటు కోత కోసిన సుమారు 40 ఎకరాల్లో పంట నష్టపోవాల్సి వచ్చిందని వాపోయారు. అలాగే కనియంపాడు సమీపంలోని పిల్లాపేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వంతెనపై రాకపోకలు సాగిస్తే ప్రమాదాలు సంభవిస్తాయని ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇరువైపులా ముళ్లకంపను అడ్డుగా వేసి ప్రజలను అప్రమత్తం చేశారు. కాగా తహసీల్దారు హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు.


అనంతసాగరం: ముత్తుకూరు వద్ద వంకలో వరద ప్రవాహం


ఉదయగిరి: ముత్తరాశిపల్లి వద్ద వాగును పరిశీలిస్తున్న తహసీల్దారు


వరికుంటపాడు: వంతెనకు అడ్డుగా వేసిన ముళ్లకంప

ఆలయ నిర్మాణానికి ఘనంగా భూమిపూజ


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తదితరులు

వింజమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండెమడకల గ్రామంలో సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ రూ.కోటి నిధులతో ఆలయం అద్భుతంగా నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్నేటి వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ మార్కెటింగ్ చైర్మన్ చెంచులుబాబుయాదవ్, డాక్టర్ మాసిలామణి, వింజమూరు టీడీపీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి, దామా మహేష్, అంకినపల్లి శివశంకర్‌రెడ్డి, అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, చల్ల వెంకటేశ్వర్లుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీకమాస పూజలు


గండిపాళెం సిద్ధేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, యర్రబల్లిగడ్డ, ఆర్లపడియ, లింగాలదొన ఆలయాలతోపాటు పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయాలకు భక్తులు వేకువజామునే చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టి కార్తీక దీపాలు వెలిగించారు. అర్చకులు స్వామివారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.

అధికారుల సమక్షంలో సామగ్రి అప్పగింత


అధికారుల సమక్షంలో గోదాము షట్టర్ తాళాలు ధ్వంసం చేస్తున్న సిబ్బంది

ఉదయగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గృహ నిర్మాణ శాఖ గోదాము షట్టర్ తాళాలను అధికారుల సమక్షంలో ధ్వంసం చేసి అందులో ఉన్న సిమెంట్, స్టీల్, ఇతరత్రా సామాగ్రిని ఇన్‌చార్జి ఏఈ షరీఫ్‌కు అప్పగించినట్లు ఇన్‌చార్జి హౌసింగ్ డీఈ షేక్ పీరాన్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మండల ఏఈగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని, అయితే అతను చార్జి అప్పగించకుండా వెళ్లిపోవడంతో రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో తాళాలను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. గోదాములో నిల్వ ఉన్న ఇనుప చువ్వలు, సిమెంట్, ఫ్యాన్‌లు, గడ్డకట్టిన సిమెంట్ బస్తాలను ఏఈకి అప్పగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, ఉప్పుటూరి పెదవెంకటయ్య, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, వీఆర్వో మాలకొండయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు నీట మునిగిన వరి


కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లి వద్ద నీట మునిగిన వరి పైరు


కలువాయి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వెంకటరెడ్డిపల్లిలో కోతకు వచ్చిన వరి పైరు నీట మునిగింది. నేల వాలిన వరి పంట మొలకలు వస్తోందని రైతులు వాపోతున్నారు. మరో రెండు రోజులు వర్షం కొనసాగితే తాము పూర్తిగా పంటను వదులు కోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **అనంతసాగరం:** వర్షాలతో మండలంలోని పలుగ్రామాల వరి రైతులు నష్టపోయారు. ఉప్పలపాడు, పాతాళపల్లి, పడమటికంభంపాడు గ్రామాల్లో కోతకు వచ్చిన సుమారు 1000 ఎకరాల పంట నీటిలో మునిగిపోయింది. తమకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

నీటమునిగిన మిరప తోట

● **మర్రిపాడు:** మండలంలో పలు గ్రామాలలో మిరప తోటలలో నీరు నిలిచి పోవటంతో అక్కడక్కడా పైర్లు దెబ్బతిన్నాయి. సన్నవారిపల్లి బొగ్గేరు, పడమటి నాయుడుపల్లి వద్ద కేతామన్నేరు వాగులు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వగా, తహసీల్దారు అనీల్ కుమార్ యాదవ్, ఎస్‌ఐ శ్రీనివాసరావు వాగులను పరిశీలించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఏఐటీయూసీ


నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకపోతే దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా నవంబరు 3నుంచి నిరవధిక సమ్మెలోకి కార్మికులు వెళ్లక తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి బి హజరత్తయ్య, ప్రచార కార్యదర్శి దొమ్మరాజు వాసు, నాగేంద్ర, ట్రెజరర్ ఎం చెంచయ్య, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ


చిన్నగోపవరం ఎస్టీ కాలనీ వాసులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

కలువాయి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెదనపర్తి, చిన్నగోపవరం సమీపంలో నల్లవాగు పొంగి రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం తహసీల్దారు డి వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఎస్ కోటయ్య, ఎంపీడీవో శైలజ కలసి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ వాగుకు సమీపంలో ఉన్న చిన్నగోపవరం ఎస్టీ కాలనీ వాసులను ముందు జాగ్రత్తగా సచివాలయ భవనంలోని వెళ్లాలని అధికారులు సూచించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తిప్పిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బాలిరెడ్డి రామోహన్ ఎస్టీ కాలనీ వాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ఉదయగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తుండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దారు షేక్ షాజియా బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కంట్రోల్‌రూమ్‌లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఏమైనా సమస్యలు ఉంటే సమాచారం అందించాలన్నారు. ఈ కంట్రోల్‌రూమ్ ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు హేమంత్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప మిగిలిన సమయాల్లో బయటకు రాకుండా నివాసాల్లోనే జాగ్రత్తగా ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ స్థానిక కార్యాలయంలో ప్రత్యేక సిబ్బందితో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా వెంటనే 9177504909 నంబరుకు సమాచారం అందజేయాలని సూచించారు.

● **ఏఎస్ పేట :** భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుధవారం తహసీల్దారు అనిల్‌కుమార్ ప్రకటన ద్వారా తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గుడిపాడు సమీపంలోని బీరాపేరు వాగు, ఏఎస్‌పేట సమీపంలోని నక్కల వాగు, తెల్లపాడు చెరువు అలుగులో నీరు చేరుతున్నాయని, మరో రెండురోజులు భారీ వర్షాలు కురుస్తాయని, దీనితో వాగులు, వంకలు పొంగి పొర్లుతాయని ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప ప్రయాణాలు చేయరాదని సూచించారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఉదయగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ డివిజన్‌లో వరి, మొక్కజొన్న, సజ్జ, వేరుశనగ, మినుము, కంది పంటలు సాగులో ఉన్నాయన్నారు. సాగులో ఉన్న పంట కయ్యల్లో వర్షపునీరు నిల్వ ఉంటే వాటిని తొలగించాలన్నారు. 33 శాతం పంట దెబ్బతింటే తాము క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు.

● **సీతారామపురం:** కురుస్తున్న వర్షాలకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. చెన్నరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు 33 శాతం కంటే ఎక్కువ నష్టం జరిగినట్లయితే వ్యవసాయ శాఖ సిబ్బంది నష్టపరిహార నివేదికను తయారు చేసి పై అధికారులకు నివేదించడం జరుగుతుందని తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం


సుప్రజ (ఫైల్)

మనుబోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయరహదారిపై కాగితాల పూరు క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండూరు సుప్రజ (40) మృతి చెందింది. బంధువుల కథనం మేరకు... మండలంలోని కాగితాల పూరు గ్రామానికి చెందిన కొండూరు వెంకటేశ్వర్లు, సుప్రజ భార్యభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. వెంకటేశ్వర్లు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సుప్రజ తల్లి స్వగ్రామం మండలంలోని గొట్లపాళెం. పనుల నిమిత్తం కుమారుడు రాకేష్‌తో కలిసి సుప్రజ మోటారుసైకిల్‌పై బుధవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గొట్లపాళెంకు వెళ్ళింది. అక్కడ పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో కాగితాలపూరుకు వస్తుండగా క్రాస్‌రోడ్డు వద్ద మలు పులో కృష్ణపట్నం పోర్టుకు వెళ్ళే ఓ ట్రక్కుఆటో మోటార్ సైకిల్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో రాకేష్, సుప్రజలు ఎగిరి రోడ్డుపై పడగా ఢీకొట్టిన వాహనమే సుప్రజ తలపై దూసుకెళ్ళింది. దీంతో సుప్రజ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. గుర్తుపట్టలేనంతగా తల నుజ్జు నుజ్జయింది. రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్‌ఐ శివరాకేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నెల్లూరు నడిబొడ్డున పేకాట కేంద్రం

- బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్, ఓ హెడ్‌కానిస్టేబుల్ సహా 18 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు


అరెస్టు చేసిన జూదరులతో సీఐ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర నడి బొడ్డునున్న ఓ హోటల్‌లో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై పోలీసులు దాడులు చేశారు. 18 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1.96 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన దేము నాయుడు బుధవారం నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు పక్కనే ఉన్న ఓ హోటల్‌లో గదిని అద్దెకు తీసుకున్నాడు. అందులో పేకాట నిర్వహించాడు. పోలీసు ఉన్నతాధికారులకు సమా చారం అందడంతో వారి ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సీతారామయ్య తన సిబ్బందితో కలిసి ఆ హోటల్‌పై దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు దేము నాయుడు, బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్, విడవలూరు పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పుల్లారెడ్డి, మరో 15 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1,96,400 నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని చిన్నబజారు పోలీసులకు అప్పగించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్యాయత్నం


- భర్త మృతి, చికిత్స పొందుతున్న భార్య


మృతదేహన్ని పరిశీలిస్తున్న సీఐ వేణు

నెల్లూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ గుడిపల్లి పాడులో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ జంట ఆత్మహత్యకు యత్నించింది. భర్త మరణించగా భార్య ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సేకరించిన వివరాల మేరకు.. గుడిపల్లిపాడులోని చిన్నచెరుకూరు రోడ్డులో దేవిరెడ్డి మురళీరెడ్డి (56) కుటుంబం నివ సిస్తోంది. ఆయన రైతుల వద్ద చేపలు కొనుగోలు చేసి చెన్నై, కేరళకు ఎగుమతి చేస్తుంటారు. ఈ వ్యాపారం అప్పుల పాలయ్యాడు. ఆ ఆర్థిక భారం మోయలేక మంగళవారం రాత్రి తన నివాసంలోని గదిలో భార్య జలజ (48)తో కలిసి గడ్డి మందు తాగారు. బుధవారం ఉదయం వారి కుమారుడు సాయి తలుపులు తీసి చూడగా వారి ద్దరు అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించి కేకలు వేశారు. సమా చారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మురళీరెడ్డి మృతి చెందినట్లు సీఐ వేణు తెలిపారు. జల జను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పా రు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మురళీరెడ్డి మృత దేహా న్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామన్నారు. ఈ ఘట న స్థానికులను దిగ్భ్రాంతికి గురి చేసింది.

వర్షాలకు కూలిన ఇల్లు

- ఇద్దరికి గాయాలు


కూలిన రేకుల ఇల్లు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా 54వ డివిజన్ జనార్ధనరెడ్డి కాలనీ పరిధిలోని అలీ నగర్‌లో ఓ ఇల్లు కూలింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి... స్థానిక అలీ నగర్‌లో షేక్ యస్దానీ కుటుంబం ఓ రేకుల ఇంట్లో నివసిస్తోంది. ఆయన కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి భార్య పర్వీన్‌తో కలసి నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా గోడలు, పైకప్పు కూలి వారిపై పడ్డాయి. దీంతో ఇరు వురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇంటిలోని సామాన్లు ధ్వంస మ య్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ జహీర్, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. మట్టి గోడలు కావడంతో వర్షాలకు బలహీ నపడి కూలినట్లు స్థానికులు భావిస్తున్నారు. నాయకులు ఈ విష యాన్ని నగర ఎమ్మెల్యే, మున్సిపల్ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని మంత్రి నారా యణ హామీ ఇచ్చినట్లు క్లస్టర్ ఇన్‌చార్జ్ జహీర్ తెలిపారు. కాగా, మంత్రి ఆదేశాల మేరకు బాధితులను స్థానిక కార్పొరేటర్ సాఫియా ముజీర్ పరామర్శించి, తక్షణ సాయంగా రూ.5 వేలు అందజేశారు.

జొన్నవాడ ఆలయ వంట స్వామి ఆకస్మిక మృతి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలోని వంటగది (మట్టుపల్లి)లో స్వామి, అమ్మవారికి నివేదనలు తయారు చేసే వంటస్వామి, ఆలయ ఉద్యోగి పారా రామ్మూర్తి (48) బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. బంధువులు ఆలయ ఈఓ వివరాల మేరకు... బుధవారం రాత్రి నెల్లూరులోని మెకానిక్ షెడ్డు వద్ద తన ద్విచక్ర వాహనం మరమ్మతులు చేయించు కుంటుంగా కుప్పకూలినట్టు బంధువులు తెలిపారు. వంటస్వామి ఆకస్మిక మృతి పట్ల ఆలయ ఈఓ, చైర్మన్, కమిటీ సభ్యులతోపాటు ఆలయ సిబ్బందితోపాటు భక్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	248

కోడిగుడ్ల ధర (100) : 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.11847
వెండి కిలో ధర	రూ. 158300
వెండి ఒక గ్రాము	రూ.164.30

గృహనిర్మాణాలకు దరఖాస్తులు చేసుకోవాలి : ఎంపీడీవో

వలేటివారిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గ్రామాల్లో పక్కాగృహాలు నిర్మించుకోవాలనుకునే లబ్ధిదారులు నవంబరు 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శంకర్‌రావు బుదవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు స్థానిక గృహనిర్మాణశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం!



బిట్రకుంట: వర్షపు నీరు తొలగిస్తున్న కార్యదర్శి



కొండాపురం: మిడతవాగు వద్ద తహసీల్దార్ సురేష్‌బాబు

కావలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. పలుచోట్ల జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో అనేక ప్రాంతాలలో చెట్లు, ఫ్లెక్సీలు నేల కొరిగాయి. మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, టీపీవో వివేకానంద్, డీఈ సాయిరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బషీర్, నాగేశ్వరరావులు పట్టణంలో పర్యటిస్తూ ముందస్తు రక్షణ చర్యలు చేపడుతున్నారు. పడిపోయిన చెట్లను ఎప్పటి కప్పుడు తొలగిస్తూ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అన్నపుగుంట వద్ద వర్షపు నీరు పరిసర ప్రాంతాలలోని ఇళ్లలోకి రాకుండా ముందస్తుగా అక్కడ కాలువలకు అడ్డుగా ఉంటున్న చెత్తా చెదారాలను తొలగించటమే కాక అక్కడ కార్మికులను ఏర్పాటు చేసి చెత్తా చెదారం ఎప్పుడు అడ్డు తగిలినా దానిని తొలగించే ఏర్పాట్లు చేపట్టారు. ఎక్సావేటర్‌తో పట్టణంలో పలు ప్రధానమైన కాలువలలో ఉన్న చెత్తను, వర్షపు నీటికి ఆటంకంగా ఉన్న చోట్ల మట్టిని తొలగిస్తూ వర్షపునీరు ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టారు. పట్టంలోని శివరామనుబ్బయ్య గిరిజన కాలనీ, చెరువుకట్ట గిరిజన కాలనీలలో గిరిజనులకు ఆహార పొట్లాలు అందచేసి వర్షాలు ఎక్కువైతే సమీపంలో ఉన్న పాఠశాలల భవనాలకు వెళ్లేందుకు సిద్దంగా ఉండాలని చెప్పారు. ఇళ్లలో నుంచి బయటకు రావద్దన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో

కావలి డివిజన్‌లోని కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు మండలాల్లోని సముద్ర తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జోరువానలు కురిసే సమయంలో ప్రజలు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్ల వద్దని తెలిపారు.

నిలిచి పోయిన ఆర్టీసీ బస్సులు

భారీ వర్షాలకు కావలి ఆర్టీసీ డిపోనుంచి రాకపోకలు సాగించే పలు బస్సులు నిలిచి పోయాయి. కొమ్మి- కొండాపురం రూట్‌లో గానుగపెంట రూట్‌లో మిడతవాగు ప్రవహిస్తుండటంతో ఆ మార్గాలలో బస్సులు నిలిచి పోయాయి. చామదల, గుడ్లదొన, సిద్దన కొండూరు, రూట్లలో తిమ్మసముద్రం రూట్‌లోనూ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి.

అప్రమత్తంగా ఉండండి

అల్లూరు : భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆయన బుధవారం లోతట్టు ప్రాంతాలైన సింగపేట గిరిజన కాలనీ, అల్లూరు పట్టణ పరిధిలోని చాకిరేవుగుంట, కొండాయగుంట, చింతగుంట, ఉడ్‌హౌస్‌పేట, తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రభు, విఆర్వోలు పాల్గొన్నారు.

కలిగిరి: భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎమ్. గిరీష్‌కుమార్ తెలిపారు. ఈవిషయమై బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రత్యూష, ఎస్ఐ ఉమాశంకర్‌తోపాటు వివిధశాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

జలదంకి: ఎడతెరిపిలేని వర్షాలకు జలదంకి మండలంలో పలు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. పలురోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలో బుధవారం కూడా భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి జలదంకి పంచాయతీ పరిధిలోని టంకంవారిపాలెంలో గోసు గోపాలయ్యకు చెందిన రేకుల ఇల్లు నేలకూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. నేలకూలిన ఇంటిని జలదంకి ఎస్ఐ ఎస్‌డీ లతీపున్నీసా, ఏఎస్ఐ హరిబాబు పరిశీలించారు. రోడ్లపై ప్రవహిస్తున్న పలు వాగులను పరిశీలించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మండల ప్రజానీకాన్ని అప్రమత్తం చేశారు. గోపన్నపాలెం వద్ద జలదంకి-తెల్లపాడు రహదారిపై వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కమ్మవారిపాలెం, చామదల వద్ద వాగులు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వాననీరు చేరడంతో వరి మళ్ళు కొంతమేర దెబ్బతిన్నాయి.

వర్షపు నీటిని తొలగించిన రెవెన్యూ సిబ్బంది

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట ముస్లింవీధి ఇళ్లలోకి వర్షపు నీరు పోకుండా సర్పంచు గండూరి మంజుల, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, కార్యదర్శి జాలయ్య చర్యలు చేపట్టారు. కొండబిట్రగుంట గిరిజన కాలనీలో వాననీరు ఇళ్లలోకి చేరింది. ఇంచార్జి కార్యదర్శి రాజేంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజ స్థానిక టీడీపీ నేతలు రావి విజయ్ కుమార్, అశోక్ నీటిని తొలగింపు చర్యలు చేపట్టారు. నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డిపాలెం అరుంధతివాడ అంతర్గత రోడ్లు జలమయంగా మారాయి. విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం గిరిజన కాలనీలో సర్పంచు మంజుల, గండూరి శ్రీనివాసులు పర్యటించి వారి అప్రమత్తం చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. బోగోలు మండల తహసీల్దారు కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దారు సూచించారు. అవసరమైతే తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలించేందుకు సిద్దంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, కోవూరుపల్లి డాక్టర్ రామకృష్ణ, ఎస్సై ఎస్.ప్రభాకర్, విద్యుత్, పీఆర్ ఏఈ లు జడరాయ, శ్రీనివాసులు, వ్యవసాయ అధికారిణి శైలజ, డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్ ఉన్నారు.

దగదర్తి (బిట్రగుంట): వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలని తహసీల్దారు బీ కృష్ణ అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. చవటపుత్తేడు, పెదపుత్తేడు మధ్య ఉన్న పిల్లి వాగును పరిశీలించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ జంపాని కుమార్, విద్యుత్, ఇరిగేషన్ ఏఈలు ఉన్నారు.

కొండాపురం: మండలంలో బుధవారం ఉదయానికి 70.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. మిడతవాగువద్ద నీరు బ్రిడ్జిపైనుండి ఉధృతంగా పారడంతో కొండాపురం- కావలి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ సురేష్ బాబు, ఎస్ఐ మాల్యాద్రి వాగును పరిశీలించారు. ఆదిమూర్తిపురం చెరువుకు నీరు చేరే కాలువ పూడిపోవడంతో తన సొంత నిధులతో సాగునీటి సంఘ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీను పూడిక తీయించారు. సాయిపేట కాలువల్లో పూడికను పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కుంకు మోహనరావు, ఆర్ఐ అనుదీప్, వీఆర్వో శ్రీను తీయించారు.

కందుకూరు డివిజన్‌లో భారీ వర్షాలు

● పొంగి పొర్లుతున్న వాగులు ● చెరువులకు జలకళ ● వరి, పొగనార్లకు నష్టం

కందుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అలపపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కందుకూరు ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కుంటలు, చెరువులు జలకళను సంతరించు కుంటున్నాయి. ఉప్పుటేరు ఉగ్రరూపం దాల్చింది. అలాగే ఈ ప్రాంతంలోని మన్నేరు, తూములేరు, పందివాగు, ఎర్రవాగు తదితర వాగులన్నీ పొంగి పొర్లుతున్నాయి. రాళ్లపాడు రిజర్వాయరులో నీటిమట్టం పెరుగుతుండగా ఇరిగేషన్ చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. ఈ వర్షాలతో నీటికుంటలు పూర్తిస్థాయిలో నిండేసూచనలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది అదనులో కురుస్తున్న వర్షాల వల్ల రబీపైర్లు సాగుకు అనుకూలిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పొగనార్లు, వరిపైరుకు నష్టం

భారీ వర్షాల వల్ల కందుకూరు ప్రాంతంలో



మాచవరంలో మొలకలు వచ్చిన వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

పొగనారుమడులకు, కోత దశలో ఉన్న వరిపైరుకు నష్టం జరుగుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కందుకూరు మండలంలోని మాచవరం, మోపాడు గ్రామాలతో పాటు పలు ప్రాంతాలలో సాగుచేసిన వరిపైరు ప్రస్తుతం కోతదశలో ఉందని, తీవ్రనష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాద వితరణ



మాలధారులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న సేవాసమితి సభ్యులు

కందుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద మాలధారులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా అలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి గుడిలో అన్నప్రసాద కార్యక్రమం కొనసాగగా దాతల తోడ్పాటుతో నిర్మించిన శాశ్వత అన్నప్రసాద భవనాన్ని బుధవారం ప్రారంభించి కార్యక్రమాన్ని ఈ భవనంలోనే ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, నలబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు హుండీల లెక్కింపు


వలేటివారిపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం కొండపైన కల్యాణ మండపంలో ఈనెల 24వ తేదీ ఉదయం 8 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమీషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

రాళ్లపాడు ప్రాజెక్టులోకి 6 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



రాళ్లపాడు ప్రాజెక్టులో 15 అడుగులకు చేరిన నీటిమట్టం

లింగసముద్రం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు ఎగువన కురిసిన వర్షాలకు మన్నేరు, పిల్లాపేరు నుండి నీటి ప్రవాహం ప్రాజెక్టులోకి చేరుతోంది. బుధవారం ఉదయం 11 అడుగులు ఉన్న నీటిమట్టం రాత్రి 7 గంటలకు 15 అడుగులకు చేరింది. సాయంత్రం 4 గంటల వరకు 6వేల వరకు ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి చేరింది. రాత్రి 7 గంటలకు ఇన్‌ఫ్లో 3000 క్యూసెక్కులకు పడిపోయింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు డీఈఈ ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇదే ఇన్‌ఫ్లో కొనసాగితే గురువారం ఉదయానికి 16 అడుగులకు నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అయితే భారీ వర్షాలు కురుస్తున్నందున తాను, జేఈ మనోహర్, సిబ్బంది ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండేందుకు రాత్రివేళ ప్రాజెక్టు వద్దే బస చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కాగా, భారీ వర్షాలింగ సముద్రం లోని చెరువులకు, మొగిలిచెర్ల, నపవని, పెద పవని తదితర చెరువులకు వర్షపు నీరు చేరుతోంది. ఆర్ ఆర్ పాలెం గ్రామం పక్కనే ఉన్న చెరువుకు సామర్థ్యానికి మించి నీరు చేరడంతో, నీరు చెరువు కట్టపై పొంగి ప్రవహిస్తోంది. కట్ట దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



అందాల విందు






వానకురిస్తే చెట్టూచేమా పండగ చేసుకుంటాయి. వాలిన మబ్బులతో ఊసులాడుతాయి. చినుకు సంగమంతో పచ్చదనం పురుడు పోసుకుంటుంది. వాగులు వంకలు కొండల్లో జలధారలు.. ఉరికే జలపాతాలు.. తడిచి తలకిబోసుకున్న అడివి అందాలు.. కొండలపై లే ఎండ మెరుపులు.. కిలకిల విరిసే పువ్వులు.. కళకళలాడుతూ ఎగిరే సీతాకోకచిలుకలు.. తిరుమలకు వచ్చే యాత్రికులకు ఈశాన్యరుతుపవనాలు కనువిందు చేస్తున్నాయి. తిరుపతి నుంచీ తిరుమల చేరుకునేదాకా ఆరబోసిన అందాలను చూస్తూ పరవశులవుతున్నారు. బుధవారం కపిలతీర్థం, మాలాడగుండం ఉధృత రూపాలను ప్రదర్శించగా అవ్వాచారికోన నడకదారి సహా అనేక చోట్ల చిన్నచిన్న జలపాతాలు జాలువారుతూ కనిపించాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, తిరుపతి, ఆంధ్రజ్యోతి






కారిడార్ అంచనా వ్యయం	:	రూ.3.04 లక్షల కోట్లు
చెన్నై- హైదరాబాదు నిడివి	:	760 కిలోమీటర్లు
జిల్లాలో కారిడార్ వెళ్లేది	:	130.58 కిలోమీటర్లు
ఇందులో అటవీ ప్రాంతం	:	6.815 కిలోమీటర్లు
సేకరించాల్సిన భూమి	:	391.74 హెక్టార్లు
అందులో అటవీ భూమి	:	20.445 హెక్టార్లు



జిల్లాకు బుల్లెట్ రైళ్లు!

- తిరుపతి మీదుగా హైదరాబాదు- చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్
- దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదన

తిరుపతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మరో మహత్తర ప్రాజెక్టు రానుంది. దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదించిన హైదరాబాదు- చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ జిల్లా మీదుగా వెళ్లనుంది. ఈ రైల్వే మార్గం రేణిగుంట విమానాశ్రయానికి కనెక్ట్ కానుంది. జిల్లాలో గూడూరు, రేణిగుంట విమానాశ్రయం వద్ద రైల్వే స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర నివేదికను వచ్చే ఏడాది మార్చిలో రైల్వే బోర్డుకు అందజేయనుంది. బోర్డు ఆమోదం పొందితే వచ్చే ఏడాది బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగే అవకాశముంది. హైదరాబాదు నుంచీ దాచేపల్లి వద్ద ఏపీలో ప్రవేశించే రైల్వే కారిడార్ నుంచి నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట విమానాశ్రయం మీదుగా ఏపీలో 504 కిలోమీటర్లు ప్రయాణించి, చెన్నై ఔటర్ రింగ్‌రోడ్డుకు చేరుకుంటుంది. అక్కడ్నుంచి చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు కనెక్ట్ కానుంది. ప్రాథమిక డిజైన్‌లో రైల్వే కారిడార్ రేణిగుంట విమానాశ్రయాన్ని కనెక్ట్ చేస్తోంది. కాకపోతే ఎయిర్‌పోర్టు వద్దా లేదా రేణిగుంటకు వెలుపల స్టేషన్ నిర్మాణానికి కూడా రెండు ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించింది. విమానాశ్రయంతో కనెక్ట్ చేస్తే విదేశాలు, దూర ప్రాంతాల నుంచీ వచ్చే యాత్రికులకు సౌకర్యంగా ఉంటుంది. దీంతో తిరుపతి ప్రాధాన్యం మరింత పెరగనుంది.

గంటకు 320 కిలోమీటర్ల వేగం

హైదరాబాదు-చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా నిర్మించే నూతన రైల్వే మార్గాన్ని గంటకు 350 కిలోమీటర్ల వేగంతో బుల్లెట్ రైళ్లు ప్రయాణించేలా డిజైన్ చేశారు. అయితే ఆపరేషనల్ స్పీడు మాత్రం గంటకు 320 కిలోమీటర్లుగా నిర్ణయించారు. రైల్వే ట్రాక్ నుంచీ సిగ్నలింగ్ సిస్టమ్, స్టేషన్ల వరకూ అన్నీ అత్యాధునికంగా ఏర్పాటు కానున్నాయి. రైల్వే స్టేషన్లు కూడా కనీసం 50 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతాయని సమాచారం. అన్నీ అనుకున్నట్టు జరిగితే మరో రెండు మూడేళ్లలో జిల్లా మీదుగా బుల్లెట్ ట్రైన్లు దూసుకుపోయే అవకాశముంది



తిరుమలలోని అతిథి గృహంలో సీఎస్‌కె సీఈవో, ఎండీ విశ్వనాథన్

బూందీపోటులో ఆధునిక యంత్రాలు

- మరో థర్మిక్ ఎక్స్ట్రాక్షన్ ట్యాంక్ నిర్మాణం
- రూ.1.5 కోట్లు కేటాయించిన సీఎస్‌కే సంస్థ

తిరుమల, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో లడ్డూ ప్రసాదాలకు వినియోగించే బూందీ తయారీ కోసం మరో 10 వేల లీటర్ల థర్మిక్ ఎక్స్ట్రాక్షన్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయనున్నారు. కోటిన్నర వ్యయంతో పనులు సాగుతున్నాయి. పోటులో అగ్నిప్రమాదాలకు అవకాశం లేకుండా థర్మో ఫ్లూయిడ్ కడాయ్ సిస్టమ్‌తో కూడి బూందీ తయారీ కేంద్రాన్ని రూ.10కోట్లతో 2020లో ఏర్పాటు చేశారు. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సంస్థ విరాళంగా ఈ మొత్తాన్ని సమకూర్చింది. ఈ వ్యవస్థకు థర్మిక్ ఆయిల్ సరఫరా చేసే 10 వేల లీటర్ల సామర్థ్యంగల థర్మిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. మరింత బూందీ తయారీకి అదనంగా 10 వేల లీటర్ల థర్మిక్ ట్యాంక్ అవసరమని టీటీడీ భావించడంతో సీఎస్‌కే అధినేత శ్రీనివాస్ దీని ఏర్పాటుకు ముందుకొచ్చారు. ప్రస్తుతమున్న ఎంఎస్(మైల్డ్ స్టీల్) పైప్ లైన్‌ను తొలగించి దీని స్థానంలో ఎస్ఎస్ (స్టెయిన్‌లెస్ స్టీల్) పైప్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. బూందీ పిండి, చక్కెర పాకం నేరుగా కడాయిల్లోకి చేరేలా పైప్‌లైన్ సిస్టమ్, అధునాతన కన్వేయర్‌బెల్ట్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. వటికి దాదాపు రూ.5 కోట్లు అవసరమవుతాయని అంచనా వేయగా శ్రీనివాసన్ అంగీకరించినట్టు అధికారులు తెలిపారు. వీటికి సంబంధించి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో సీఎస్‌కే సీఈవో, ఎండీ విశ్వనాథన్, టెక్నికల్ కన్సల్టెంట్ శంకర్, రఘునాథన్ బుధవారం చర్చించారు. స్వామి లడ్డూప్రసాదం తయారీలో తాము భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని విశ్వనాథన్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

వెలుగులు చిమ్మే ఆకాశదీపం



వెలుగుతున్న ఆకాశ దీపం

శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఆకాశదీపం కన్నులపండువగా వెలిగించారు. కార్తీక మాసం సందర్భంగా ప్రతి రోజు ఈ ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేసి స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.



ఆకాశదీపానికి పూజలు

నేడూ విద్యాసంస్థలకు సెలవు

తిరుపతి(విద్య), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా జిల్లాలో అన్ని విద్యాసంస్థలకు గురువారమూ సెలవు ప్రకటించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆమేరకు ప్రభుత్వ, ప్రైవేటు, అన్‌ఎయిడెడ్, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు, పాఠశాలలు, అంగన్వాడీలకు సెలవు ప్రకటించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రాజశేఖర్‌రెడ్డి, డీఈవో కేవీఎన్ కుమార్ ఆయా శాఖల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

పొలాల్లో ఏనుగుల బీభత్సం

చంద్రగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎ.రంగంపేట పరిధిలో మూడు రోజులుగా ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున 9 ఏనుగుల గుంపు కందులవారిపల్లె, కూచువారిపల్లెలో అటవీ ప్రాంత సమీపంలోని పంట పొలాలపై విరుచుకుపడ్డాయి. వరి, అరటి, కొబ్బరి తోటలను తొక్కేశాయి. పెన్సింగ్‌ను, నీటి పైపులను కూడా ధ్వంసం చేశాయి. తర్వాత నాగపట్ల వెస్ట్ బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలోకి వెళ్ళాయి. ఏనుగుల దాడిపై అటవీశాఖ అధికారులకు రైతులు సమాచారమందించారు. వారు చేరుకుని ఏనుగులు గుంపును తరిమేందుకు బాణసంచా కాలుస్తూ, డప్పులు వాయించారు. రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని రైతులకు, ప్రజలకు అటవీ శాఖ అధికారులు సూచించారు.



కందులవారిపల్లెలో ధ్వంసమైన వరి

జేఎన్‌టీయూకు అనుసంధానంగా 'స్కిట్'

శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూకు అనుసంధానం చేస్తూ మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. నాలుగేళ్ల కిందట మూతపడిన స్కిట్‌ను జేఎన్‌టీయూతో అనుసంధానం చేస్తూ తిరిగి ప్రారంభించేలా ఇటీవల ప్రభుత్వం కసరత్తు చేసిన విషయం తెలిసిందే. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. 40మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. అధికారికంగా స్కిట్ కళాశాల భవనాన్ని ముక్కంటి ఆలయం నుంచి జేఎన్‌టీయూకు 33 ఏళ్లపాటు లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ తుది జీవో విడుదలైంది. దీంతో తరగతుల ప్రారంభానికి అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. త్వరలోనే తరగతులు ప్రారంభానికి అధికారులు శ్రీకారం చుట్టనున్నారు.

ముంచెత్తిన వాన | వరదల తీవ్రతపై డ్రోన్లతో నిఘా | - వివరాలు 6లో -

తడకు చేరుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

తడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాగం పూర్తిగా సన్నద్ధమైంది. ప్రతి పంచాయతీకి ప్రత్యేక అధికారుల నియమాకాన్ని చేపట్టారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బుధవారం రాత్రి తడకు చేరుకుంది. అలాగే, కాళంగి రిజర్వాయర్ నాలుగు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తుండడంతో నదీ పరివాహక గ్రామాల్లో అప్రమత్తం చేశారు. మండలంలో మూడు చోట్ల పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రజలను తరలించేందుకు వాహనాలనూ సిద్ధంగా ఉంచారు.

వేదోక్తంగా కోటి బిల్వార్చన

శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కోటి బిల్వ, కుంకుమార్చనను బుధవారం ప్రారంభించారు. కార్తీక మాసం సందర్భంగా ఉదయం 8.45 గంటలకు స్వామి సన్నిధిలో బిల్వార్చన, అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన ప్రారంభించారు. మధ్యాహ్నం 12.30గంటల వరకు మూడు కాలాల పాటు సాగించారు. తిరిగి సాయంత్రం 5.30గంటల నుంచి 7 గంటల వరకు నాల్గో కాలం అర్చన చేశారు. దీంతో తొలిరోజు అర్చన ముగిసింది.



పూజలు చేస్తున్న వేదపండితులు

జిల్లా అంబుడ్స్ పర్సన్‌గా బి.మురళి

తిరుపతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి జిల్లా అంబుడ్స్ పర్సన్‌గా బి.మురళి నియమితులయ్యారు. విధుల్లో చేరినప్పటి నుంచి రెండేళ్లపాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. ఉపాధి హామీపై కూలీలు, ఇతరులు చేసే ఫిర్యాదులను స్వీకరించడం, విచారణ జరిపి అవార్డులు జారీ చేయడం అంబుడ్స్‌పర్సన్ ప్రధాన విధి.

25వరకు సెలవుపై కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం వరకు సెలవుపై వెళ్లారు. తిరిగి ఆదివారం నుంచి యధావిధిగా విధుల్లో ఉండనున్నారు. తుఫాన్ నేపథ్యంలో ఎప్పటికపుడు జిల్లా అధికారులతో సమీక్షిస్తూ పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇక క్షేత్రస్థాయిలోని లోతట్టు ప్రాంతాల్లో ఇన్‌ఛార్జి జేసీ మౌర్య పర్యటిస్తున్నారు.

దేవదాయ ఆర్జేసీకి జేసీగా అదనపు బాధ్యతలు

తిరుపతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ తిరుపతి రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్జేసీ) చంద్రశేఖర్ ఆజాద్‌కు ప్రభుత్వం ఆ శాఖ ఎస్టేట్స్ విభాగం జాయింట్ కమిషనర్ (జేసీ)గా అదనపు బాధ్యతలను అప్పగించింది. గొల్లపూడిలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలోని ఎస్టేట్స్ విభాగానికి ప్రస్తుతం భ్రమరాంబ జాయింట్ కమిషనర్‌గా వున్నారు. ఆమె ఈనెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఆ పోస్టులో తిరుపతి ఆర్‌జేసీ ఆజాద్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వివాహం కాలేదని ఆత్మహత్య

● గరుడ వారధి నుంచి దూకిన మదురై యువకుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వివాహం కాలేదనే మనోవేదనతో బుధవారం ఉదయం తిరుపతిలోని గరుడ వారధిపై నుంచి దూకి మదురైకి చెందిన పాండియ రాజన్(31) ఆత్మహత్య చేసుకున్నాడు. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు తెలిపిన ప్రకారం.. రాజన్ తన కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో తిరుపతికి చేరుకున్న ఇతడు రైల్వేస్టేషన్‌లో కుటుంబ సభ్యులతో సరదాగా గడిపాడు. తాను బస్సులో వస్తానని చెప్పి వారిని పంపించాడు. అనంతరం కపిలతీర్థం సర్కిల్‌కు చేరుకుని గరుడ వారధిపై నుంచి నడుచుకుంటూ ప్రకాశం మున్సిపల్ పార్కు వద్దకు వచ్చి దూకేశాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు 112కు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించి ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. మృతుడి వద్ద ఉన్న మొబైల్ నంబరు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఎన్ని సంబంధాలు చూసినా పెళ్లి కుదరడం లేదని కొన్ని రోజులుగా అతడు బాధపడుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు.



మృతిచెందిన రాజన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానేంద్రనాథ్ రాయ్, మాజీ మంత్రి ఆర్కే రోజా, నటి రవళి, ప్రభుత్వ సలహాదారుడు ఆర్పీ ఠాకూర్ ఉన్నారు.



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఒక షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.34 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,343

తలనీలాలు సమర్పించినవారు: 18,768







నారాయణవనం, పుత్తూరు మండలాల్లో కైలాసకోన, మూలకోన జలపాతాల జోరు

ముంచెత్తిన వాన



కోట: గూడలి వద్ద పరవళ్లు తొక్కుతున్న స్వర్ణముఖి

మండలం	వర్షపాతం (మిమీలలో)
శ్రీకాళహస్తి	184.6
తొట్టంబేడు	176.8
బీఎన్ కండ్రిగ	149.4
పెళ్లకూరు	144.2
దొరవారిసత్రం	143.8
వడమాలపేట	141.8
సూళ్లూరుపేట	135.6
ఏర్పేడు	132.8
వెంకటగిరి	126.6
డక్కిలి	124.2
బాలాయపల్లి	112.4
తిరుపతి రూరల్	108.8
గూడూరు	107.2
వరదయ్యపాలెం	103.2
రేణిగుంట	100.6
తిరుపతి అర్బన్	98.4
ఓజిలి	98.2
తడ	97.8
చిల్లకూరు	94.2
రామచంద్రాపురం	88.2
చంద్రగిరి	84.6
కేవీబీపురం	82.2
నాయుడుపేట	80.4
పాకాల	79
సత్యవేడు	78
ఎర్రావారిపాలెం	64
నారాయణవనం	60.4
చిట్టమూరు	58.8
పిచ్చాటూరు	56.6
పుత్తూరు	51.2
నాగలాపురం	48.6
వాకాడు	42.4
కోట	41.4
చిన్నగొట్టిగల్లు	31.6

గరిష్ఠ వర్షపాతం: శ్రీకాళహస్తిలో 18.4 సెంటీమీటర్లు, **కనిష్ఠం:** చిన్నగొట్టిగల్లులో 3.1 సెంమీ, **15 మండలాలు:** 10 సెంమీకుపైగా వర్షం, **జిల్లా సగటు వర్షపాతం:** 97.9 మిల్లీమీటర్లు

● వాగులు, వంకలు, జలపాతాల ఉధృతి

● పలు మార్గాల్లో రాకపోకలు బంద్

భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. మంగళవారం లాగే బుధవారమూ వానలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు, జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నదుల్లోనూ ప్రవాహం మొదలైంది. పలు చోట్ల చెరువుల్లోకి నీరు చేరుతోంది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో పలు చోట్ల రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లావ్యాప్తంగా 19 మార్గాల్లో 44 ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దయ్యాయి. స్వర్ణముఖి ఉధృతి కారణంగా గుడిమల్లం ఆలయానికి వర్షాలు తగ్గేవరకూ రావద్దంటూ అధికారులు భక్తులను కోరారు. తిరుపతిలోని కపిలతీర్థం, నారాయణవనం మండలం కైలాసకోన, పుత్తూరు మండలం మూలకోన తదితర జలపాతాలు జోరుగా ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల పంట పొలాలు నీటమునిగాయి. తూపిలిపాలెం సముద్రతీరం పరిశీలించిన రెవెన్యూ అధికారులు వేటకు వెళ్లొద్దంటూ మత్స్యకారులకు సూచించారు.

\- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

ఈ దారిన రావొద్దు



గూడూరు: పంబలేరు చప్టాపై ఆగిన రాకపోకలు

● బాలాయపల్లి మండలం నిండలి వద్ద కైవల్యానది బ్రిడ్జిపైకి వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

● చిల్లకూరు మండలం తిప్పగుంటపాలెం వద్ద ఉప్పుటేరు కాజ్‌వేపై ఉధృత ప్రవాహంతో వాహనాల రాకపోకలు ఆగాయి.

● గూడూరు పంబలేరు వంతెన వద్ద రోడ్డుపైకి వరద నీరు చేరింది. వాహనాల రాకపోకలను ఆపేసి, పోలీసు కాపలా ఏర్పాటు చేశారు.

● రేణిగుంట మండలం కల్లూరు వంక ఉధృతితో రాకపోకలు ఆగాయి. అత్తూరు మార్గంలో వాగు పొంగడంతో పోలీసులు రాకపోకలు నిలిపేశారు. రేణిగుంట- అన్నాసామిపల్లె మార్గంలో వాగు ఉధృతి కారణంగా రాకపోకలు ఆపేశారు.

● ఏర్పేడు మండలం మోదుగులపాలెం- కొత్తవీరాపురం మార్గంలో స్వర్ణముఖి నది బ్రిడ్జిపైకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసు కాపలా ఉంటున్నారు.

● చావాలింగమనాయుడుపల్లి పంచాయతీలో పాముల కాలువ ఉధృతికి సంతవేలూరు- వరదయ్యపాలెం మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి.

● కేవీబీపురం మండలం కోవనూరు వద్ద వాగు ప్రవాహం రోడ్డుపైకి రావడంతో శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

● నాగలాపురం మండలం నందనం గ్రామానికి రాకపోకలు నిలిచాయి.

● వరదయ్యపాలెం మండలం గోవర్ధనపురం బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు నిలిపివేసి పోలీసు కాపలా ఏర్పాటు చేశారు.

● తిరుపతి అర్బన్ మంగళం- శెట్టిపల్లె రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



ఏర్పేడు: మోదుగుపాళెం వద్ద స్వర్ణముఖి ఉధృత ప్రవాహం



వరదయ్యపాళెం: గోవర్ధనపురం వంతెనపై పోలీసు భద్రత







దొరవారిసత్రం: వెదురుపట్టు రోడ్డులోని పాలకాలువ వంతెనపై వరద

సూళ్లూరుపేట: చెంగాళమ్మ ఆలయం వద్ద కాళంగి నది ఉధృత ప్రవాహం

రామచంద్రాపురం: రాయలచెరువుకు నీటికళ

రోడ్డెక్కిన ప్రవాహం

● చిల్లకూరు మండలం వరగలి క్రాస్ వద్ద రోడ్డుపైకి వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ స్తంభించింది. ● సూళ్లూరుపేట- కోట పోలూరు మార్గంలో పుచ్చ కాలువ ఉధృతి పెరగడంతో రోడ్డుపైకి నీరు చేరింది. ● సూళ్లూరుపేట మండలం ఇలుపూరు- మంగళంపాడు రోడ్డులో దొండకాలువ పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది.

చిల్లకూరు: వరగలి క్రాస్‌రోడ్డు సమీపాన జాతీయ రహదారిపై ఆగిన వాహనాలు



వాగులు, వంకల ఉధృతి

● డక్కిలి మండలం వెలిగొండ కొండల్లో నుంచీ వచ్చే వాగులన్నీ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతోంది. కొండేరు వాగు ఉధృతంగా పారుతోంది.

● వెంకటగిరి మండలంలో గుడ్డేరు వాగు, బాలాయపల్లెలో కైవల్యానది జోరుగా ప్రవహిస్తున్నాయి.

● ఏర్పేడు మండలం గుడిమల్లంలోని సీతకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. నాయుడుపేట, కోట, శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖి ప్రవహిస్తోంది.



బాలాయపల్లె: నిండలి వద్ద కైవల్యా నది ప్రవాహం

చెరువును తలపిస్తూ..

● రేణిగుంట మండలం అడుసుపాలెం జగనన్న కాలనీ నీట మునిగి చెరువును తలపిస్తోంది. పలు ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. జీపాలెం పంచాయతీ పద్మానగర్ లే అవుట్ నీట మునిగింది. పాంచాలినగర్, భగత్ సింగ్, నేతాజీ కాలనీల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.

● ఏర్పేడు మండలం ఇసుక తాగేలి పంచాయతీ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరడంతో బ్లీచింగ్ పౌడర్, సున్నం బస్తాలు నీటిపాలయ్యాయి. ప్రాథమిక పాఠశాలలోకీ నీళ్లు చేరాయి.

● తిరుచానూరు పంచాయతీ కార్యాలయం వద్దా నీళ్లు చేరాయి.

దెబ్బతిన్న రోడ్లు, చెరువు కట్టలు

● రేణిగుంట మండలం తూకివాకం రైల్వే వంతెన వద్ద నిర్మాణంలోని రోడ్డు వర్షాలకు దెబ్బతింది. రైలింగ్‌తో పాటు మట్టి కూడా దిగువకు జారిపోతోంది.

● ఏర్పేడు మండలం జంగాలపల్లి చెరువుకు నీటి ఉధృతితో రింగ్ బండ్ కొట్టుకుపోయింది. నీళ్లు వృథాగా పోతున్నాయి.

● కేవీబీపురం మండలంలో కాళంగి నది ఉధృతికి పూడి గ్రామాలకు వెళ్ళే మట్టి రోడ్డు కొట్టుకుపోయింది.

సందర్శకులూ ఇటు రావొద్దు

పుత్తూరు మండలం మూలకోన జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఎకో టూరిజం చెక్‌పోస్టు మూసివేసి సందర్శకుల రాకపోకలు నిలిపేశారు.

నీటమునిగిన అండర్ బ్రిడ్జిలు

తిరుపతిలో వెస్ట్ చర్చి వద్ద, ఈస్ట్ పోలీస్ స్టేషన్‌ల వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు నీట మునిగాయి. నగరంలోని గొల్లవానిగుంట, సుభాష్ నగర్, అశోక్ నగర్, లీలామహల్ కూడలి, మహిళా వర్శిటీ కూడలి, వైకుంఠపురం కూడలి, ఎమ్మార్‌పల్లి సర్కిల్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి.

17 పశువుల మృతి.. దెబ్బతిన్న పంటలు

శ్రీకాళహస్తిలో ఒక పక్కా ఇల్లు కూలగా, మరొకటి పాక్షికంగా దెబ్బతింది. బీఎన్ కండ్రిగలో నాలుగు గుడిసెలు కూలిపోయాయి. ఓజిలి మండలంలో రెండు గేదెలు, బీఎన్ కండ్రిగలో 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. తొట్టంబేడు మండలంలో రెండు ఎకరాల్లో కాకర పంట దెబ్బతినగా నష్టం రూ.60 వేలుగా అంచనా వేశారు.

వరదయ్యపాళెం: అంబూరు వద్ద నీట మునిగిన వరిపంట









చెరువులా లక్ష్మీపురం సర్కిల్


తిరుపతిలోని డీఆర్‌మహల్ వద్ద వర్షపునీటితో రైల్వే అండర్ బ్రిడ్జి నిండటంతో బ్యారికేడ్లు పెట్టిన అధికారులు

19 మార్గాల్లో బస్సులకు అంతరాయం

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వర్ష ఉధృతి నేపథ్యంలో 19రూట్లలో బుధవారం 44 ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపేశారు. కొన్ని డిపోలకు పరిమితం కాగా, మరికొన్నింటిని దారి మళ్లించారు. తిరుమల ఘాట్‌లో యథావిధిగా రాకపోకలు సాగించాయి. సీతమ్మకాలువ, కోవనూరుకాలువ, కలవూరు ఏటికాలువ, పున్నేపల్లి, గోవర్ధనపురం, పాపవినాశనం, తాటిమాకులకండ్రిగ, టన్నెల్లి, కురుగొండ, మనమాల, సీఎన్ పల్లి, ఆళత్తూరు, నెన్నూరు, చిన్నబిడికి, బలిరెడ్డిబ్రిడ్జి, కుమ్మరపాళెం, శ్రీనివాసపురం, ఇన్నతోట మార్గాల్లో బస్సు సర్వీసులు ఆగాయి.

కల్యాణి డ్యామ్‌కు జలకళ

చంద్రగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని కల్యాణి డ్యామ్‌లో నీటిమట్టం రెండు రోజుల ముందు 836 అడుగులు ఉండగా.. బుధవారం రాత్రికి 851 అడుగులకు చేరింది. రాగిమానుకోన, అనుమకోన, అబ్బాలమేరు, చీకుమానుకోన, గుండాలపెంట వాగుల నుంచి వరద నీరు ఎక్కువగా వస్తోంది. మరో వైపు స్వర్ణముఖి నదీ ప్రవాహంతో రవణప్పగారిపల్లె వద్ద వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. ఇక, రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్ పూర్తిగా నిండగా.. అరణియార్, కాళంగి రిజర్వాయర్లలోకి నీరు చేరుతోంది. ● వాకాడు మండలంలో స్వర్ణముఖి బ్యారేజీకి ఎగువ నుంచి మూడు వేల క్యూసెక్కులు వస్తుండగా.. 2500 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. మరో 500 క్యూసెక్కుల నీటిని చెరువులకు విడిచిపెడుతున్నారు.



కల్యాణి డ్యామ్‌లో పెరుగుతున్న నీరు



రుయాలో రోగుల అవస్థలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం కురిసిన జోరు వర్షానికి రుయాస్పత్రిలోని పలు వార్డుల్లోకి నీరు చేరడంతో రోగులకు తిప్పలు తప్పలేదు. ఓపీకి, వార్డుల్లోకి, వైద్య పరీక్షలకు వెళ్లేందుకు వర్షంలోనూ తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. నడవలేని స్థితిలో ఉన్న రోగులను వర్షంలోనే వారి సహాయకులు వీల్‌చైర్లు, స్ట్రెచర్లపై తీసుకెళ్లాల్సి వచ్చింది. టీబీ వార్డులో శ్లాబు పైకప్పు నుంచి వర్షపు నీరు లీకవడంతో మందులు తడిచి పోయాయి.

తీరప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో తీర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఇన్‌చార్జి జేసీ మౌర్య తెలిపారు. హోం మంత్రి అనిత బుధవారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. భారీ వర్షపాతం నమోదైన చోట్ల లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే రేణిగుంటలో కొందరిని తరలించామన్నారు. అనంతరం ఆమె అధికారులతో సమీక్షించారు. అప్రమత్తంగా ఉంటూ ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో ఇన్‌చార్జి జేసీ మౌర్య, డీఆర్వో

వరదల తీవ్రతపై డ్రోన్లతో నిఘా

● వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎస్పీ పర్యటన

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వరదల తీవ్రత, లోతట్టు ప్రాంతాల్లో వర్ష ప్రభావం ఎలా ఉందనేది తెలుసుకోవడానికి డ్రోన్లతో నిఘా ఉంచారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. జిల్లాలోని వర్ష ప్రభావిత ప్రాంతాలైన తిరుపతి, నాయుడుపేట, సూళ్ళూరుపేట తదితర ప్రాంతాల్లో బుధవారం ఎస్పీ పర్యటించారు. ఆయా సబ్ డివిజన్లలో పరిస్థితి సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బాధిత ప్రజలకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఎవరికీ సెలవులు లేవని స్పష్టంచేశారు. నదులు, వాగులు, వంకల వద్ద పికెట్లు ఏర్పాటు చేసి గస్తీ నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా శిథిల కట్టడాలుంటే తొలగించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 112కు, పోలీసు వాట్సాప్ నెంబరు 8099999970కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



అధికారులతో కలసి పర్యటిస్తున్న ఎస్పీ

అల్పపీడనం వేళ అప్రమత్తంగా ఉండండి

● సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్),అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సదరన్ డిస్కం సీఎండీ ఎల్.శివశంకర్ ఆదేశించారు. తిరుపతినుంచి బుధవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే క్రమబద్ధీకరించకుంటే చర్యలు తతీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నంబర్లు 1912 లేదా 18004251553333లకు తెలియజేయాలన్నారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, సీజీఎంలు పి.సురేంద్రనాయుడు, చక్రపాణి, ఎస్ఈలు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న ఎల్.శివ శంకర్

వరద ప్రాంతాల్లో పోలీసుల ప్రత్యేక చర్యలు: ఎస్పీ



కలవకూరు చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

పెళ్లకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో వరద తాకిడి ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పోలీసులు తెలిపారు. బుధవారం మండలంలోని కలవకూరు వద్ద స్వర్ణముఖి నదిపై నిర్మించిన చెక్‌డ్యాంను అధికారులతో కలిసి ఎస్పీ పరిశీలించారు. వరద ఉధృతి అధికంగా ఉండడంతో చెక్‌డ్యాంపై రాకపోకలను మూసివేయాలని ఆదేశించారు. దీంతో డీఎస్పీ చెంచుబాబు, సీఐ సంగమేశ్వర రావు, ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో ముళ్లకంపలు, బారికేడ్లను దారికి అడ్డంగా పెట్టి దారి మూసివేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, వీఆర్వో వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి, పక్కన నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు

సూళ్లూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. బుధవారం సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆమె నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబుతో కలిసి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో కాళంగి నది, పాముల కాలువ, పుచ్చాకాలువల్లో ప్రవాహం అధికమయ్యే అవకాశం ఉందన్నారు. ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దన్నారు. పోలీసులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ సమాచారం ఎప్పటికప్పుడు చేరవేయాలన్నారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా: పాశిం



సుధాకర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

కోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. అలాగే విద్యానగర్‌లో విశ్రాంత అధ్యాపకుడు కుంచం సుధాకర్ మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిన్నెలపూడిలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నేత గోపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన తెలుగు మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ రజినమ్మలను వారి ఇళ్లకు వెళ్లి పలకరించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్ రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నీరు నిల్వ చేరకుండా చర్యలు



రామలింగయ్యకాలనీలో నీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న శ్రావణి

గూడూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలోని రామలింగయ్య ఎస్టీ కాలనీలో రోడ్లపై వర్షపునీరు నిల్వ చేరకుండా చర్యలు చేపట్టినట్లు తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి తెలిపారు. బుధవారం కాలనీలో వర్షపునీరు నిల్వచేరడంతో స్థానికుల అవస్థలను గుర్తించి నీటిని తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీలో రోడ్లపై నీరు చేరడంతో పాటు నివాస గృహాల్లోకి వస్తుండడంతో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లి మున్సిపల్ సిబ్బంది సహకారంతో కాలువలు తీయించి నీటిని తొలగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హేమ కుమార్‌రెడ్డి, అశోక్, కృష్ణమూర్తి, రాజేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు 'విండో'లకు పాలకవర్గాలు

తిరుపతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్ళూరుపేట నియోజకవర్గంలో రెండు సింగిల్‌విండోలకు పాలకవర్గాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 19 సింగిల్ విండోలకు ప్రస్తుతమున్న అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కమిటీల స్థానంలో నాన్ అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కమిటీలను ప్రభుత్వం నియమించగా, అందులో జిల్లాకు సంబంధించి దామానెల్లూరు, నెలబల్లి సింగిల్ విండోలున్నాయి. దామానెల్లూరు సింగిల్‌విండోకు జి.నారాయణరెడ్డి ఛైర్‌పర్సన్ గానూ, ఎల్లి ధనపాల్, పుట్టు విజయ్ రాఘవన్ సభ్యులుగానూ నియమితులయ్యారు. అలాగే నెలబల్లి సింగిల్‌విండోకు ముప్పాళ్ళ శ్రీహరిరెడ్డి ఛైర్‌పర్సన్‌గా, సంచి విజయ్‌కుమార్, మల్లేపల్లి సుబ్రమణ్యం సభ్యులుగా నియమితులయ్యారు. ఈ కమిటీల గడువు వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ వరకూ వుంటుంది. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట అర్బన్, రూరల్ పోలీసు సర్కిల్ కార్యాలయాలను బుధవారం రాత్రి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తనిఖీ చేశారు. రిసెప్షన్‌లో కేసుల నమోదు రిజిష్టర్‌ను, ఫిర్యాదుదారులకు ఇచ్చే రశీదు బుక్కును పరిశీలించారు. ఎస్పీ వెంట నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐలు బాబి, సంగమేశ్వరరావు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గూడూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే స్థానిక నాయకులు సహాయం అందించాలన్నారు.

వీడని వాన

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

వంతెనలు, చప్టాలపై రాకపోకల నిలిపివేత



దొరవారిసత్రం: తనియాలి వద్ద కాళంగి వంతెనపై వరద నీరు



ఓజిలి: చెరువులా మారిన పంట పొలాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం కూడా జోరువాన కురిసింది. సూళ్లూరుపేట పట్టణంలో వేకుజామున నుంచి భారీ వర్షం కురడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని వర్షపు నీరు చుట్టిముట్టింది. జీఎన్‌టీ రోడ్డు, శ్రీహరికోట రోడ్డు, సాయినగర్ ప్రధాన రోడ్లన్నీ జలమయంగా మారాయి, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో వర్షపునీరు నిలబడి మడుగును తలపిస్తున్నాయి. ఇలుపూరు - మంగళం పాడు మధ్యలో ఉన్న డొండకాలువ నీరు రోడ్డుకు పైకి చేరింది. సూళ్లూరు పేట - కోటపోలూరు రోడ్డుపై పుచ్చాకాలువ పొంగి ప్రవహిస్తోంది. చిన్న ఉల్లాపడవ - మన్నెముత్తేరి మధ్యలో ఉన్న పుచ్చాకాలువ వంతెనపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపివేశారు. వీడని వర్షంతో కాళంగి నదికి భారీగా వరదనీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే నెర్రికాలువ, పుచ్చాకాలువ, పాముల కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. పట్టణంలో డ్రైనేజీ కాలువలు సరిగ్గా లేకపోవడంతో వర్షపునీరంతా రోడ్లపై పారుతుండంతో ప్రజలతో పాటు వాహన చోదకులకు ఇబ్బందులు తప్పలేదు.

దొరవారిసత్రం: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో కాళంగి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కాళంగి ప్రవాహంతో తనియాలి వంతెన నీట మునిగింది. దీంతో తనియాలి, బుదూరు, మంగా నెల్లూరు, ఆర్మేనికండ్రిగ తదితర గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. అలాగే కాళంగి పరివాహక ప్రాంతంలోని కుప్పారెడ్డిపాళెం సమీపంలో వెదురుపట్టు రోడ్డులో ఉన్న పాలకాలువ వంతెనపై కూడా వరద ప్రవహిస్తోంది.

కోట: భారీ వర్షాలతో కోట మండలంలో నదులు, కాలువలకు జలకళ వచ్చింది. సముద్రంలో అలల ఉధృతి పెరగడంతో అధికారులు రెడ్‌అలర్ట్ ప్రకటించారు. మత్స్యకారులు బుధవారం కూడా చేపల వేటకు వెళ్లలేదు. గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి నదిలోకి నాయుడుపేట, శ్రీకాళహస్తి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు చేరడంతో వాకాడు బ్యారేజి, చల్లకాలువ పరవళ్లు తొక్కాయి. అదేవిధంగా గోవిందపల్లి పాళెం, శ్రీనివాససత్రం గ్రామాల సమీపంలో సముద్రం కల్లోలభరితంగా మారింది. సముద్రం 20 మీటర్లు ముందుకు రావడంతో మత్స్యకారులు చేపల వేట నిలిపివేశారు. తహసీల్దార్ జయజయరావు, సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, ఎస్ఐ పవన్‌కుమార్ మత్స్యకార గ్రామాలను సందర్శించి స్థానికులను అప్రమత్తం చేశారు. సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో నారు మడులు నీట మునిగాయి.

పెళ్లకూరు: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ హరికృష్ణ సూచించారు. బుధవారం కప్పగుంటకండ్రిగ కాజ్‌వే వద్ద స్వర్ణముఖి నదీ ప్రవాహాన్ని ఎస్ఐ నాగరాజుతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతానికి వరద ఉధృతి తక్కువగా ఉన్నప్పటికీ ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా పొలం పనులకు వెళ్లే రైతులు విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు.

నాయుడుపేట: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో స్వర్ణముఖినది ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే నాయుడుపేట అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలోని మామిడికాలువ జలకళ సంతరించుకుంది.

ఓజిలి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కాలువలు, దొరువులు, కుంటలు నిండి పారుతున్నాయి. మానమాల - కొండవల్లిపాడు, మానమాల - చిలమత్తూరు, పున్నేపల్లి - సగుటూరు, వెంకటరెడ్డిపాళెం - ఆచార్లపార్లపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. తెలుగుగంగ బ్రాంచి కాలువల వర్షపు నీటితో నిండి ప్రవహిస్తున్నాయి.

గూడూరు: పట్టణంలో మోస్తరు వర్షం కురిసింది. పైప్రాంతాల్లో నుంచి వరదనీరు రావడంతో పంబలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పంబలేరు చప్టాపైకి వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలను ఆపేశారు. పట్టణంలో అంబేడ్కర్ నగర్ సమీపంలోని రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద మోకాలు లోతులో నీరు నిల్వచేరడంతో వాహనదారులు, పాద చారులు అవస్థలు పడ్డారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ తిరుపతయ్య రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు.

చిల్లకూరు: మండలంలోని తిప్పగుంటపాళెం ఉప్పుటేరు చప్టాపైకి వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలను నిలిపివేశారు. వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపైకి వర్షపునీరు పారుతుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు కిలోమీటర్ల పొడవునా వాహనాలు ఆగిపోవడంతో ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించారు. కృష్ణాపురం గిరిజన కాలనీలోని నివాస గృహాల్లోకి వర్షపునీరు స్థానికులు అవస్థలు పడ్డారు. తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న పలు నివాసగృహాల సమీపంలో వర్షనీరు నిల్వచేరడంతో తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ సీనియర్ నాయకులు తానంకి నానాజీ వర్షపునీటిని తొలగించారు.

బాలాయపల్లి: మండలంలో మూడూ రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, కాలువలు ఉప్పొంగాయి. కైవల్యానది ఉధృతంగా ప్రవహిస్తోంది. నిండలి వద్ద బ్రిడ్జిపై నీరు పారుతుండడంతో బాలాయపల్లి మండలంలోని వాక్యం, నిండలి, డక్కిలి మండలంలోని దగ్గవోలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గొట్టికాడు వద్ద ఉన్న కాలువ ఉప్పొంగడంతో చప్టా పై నీటి ఉధృతి పెరిగి వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ విజయలక్ష్మి నిండలి వద్ద కైవల్యానది ఉధృతిని పరిశీలించారు. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని వీఆర్వోలను ఆదేశించారు.



సూళ్లూరుపేట: శ్రీహరికోట మార్గంలో గురుకుల పాఠశాల వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



గూడూరు: అంబేడ్కర్‌నగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద వర్షపునీరు

వెంకటగిరి టౌన్: వెలుగొండ అడవుల్లో నుంచి వచ్చే వర్షపు నీటితో పట్టణంలోని కైవల్యానది ఉధృతంగా ప్రవహిస్తోంది. మరో రెండు రోజులు వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

డక్కిలి: మండలంలో రెండు రోజులుగా భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. మండలంలోని నరసనాయుడుపల్లిలో డ్రైనేజీ కాలువలు పూడిపోవడంతో వరదనీరు రోడ్డుపై ప్రవహిస్తూ ఇళ్లల్లోకి చేరడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో వరవ కాలువకు మళ్లించారు. వెలుగొండ కొండల్లో నుంచి వస్తున్న వర్షపునీటితో చెరువులు నిండుతున్నాయి. తహసీల్దార్ శ్రీనివాసులు పలు గ్రామాలను సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు.

చిట్టమూరు: నాయుడుపేట - మల్లాం మార్గంలోని తాగేటమ్మగుడి వద్ద ఉన్న రొయ్యల కాలువ వంతెనపై వరద నీటి ప్రవాహం పెరగడంతో తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎస్ఐ చిన్న బలరామయ్య పరిశీలించారు. వంతెనపై బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోలు నిలిపివేశారు. రొయ్యల కాలువ పరివాహక ప్రాంతాలను పరిశీలించి సహాయక చర్యలు చేట్టారు.

వాకాడు: అల్పపీడన ప్రభావంతో తూపిలిపాళెం సముద్రతీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి. 10 మీటర్ల మేర సముద్రం చొచ్చుకు రావడంతో మత్స్యకారులు భయాందోళనలకు గురవుతున్నారు. తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ సిబ్బందితో కలిసి తీరంలో పర్యటించారు. గంటకు సుమారు 70 మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. స్వర్ణముఖినదిలోకి 7వేల క్యూసెక్కుల వరదనీరు రానుండడంతో గురువారం గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలనున్నట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.







వెంకటగిరి టౌన్: ఉధృతంగా ప్రవహిస్తున్న కైవల్యానది - కోట: స్వర్ణముఖి కలుజు పొంగి చల్లకాలువలోకి ప్రవహిస్తున్న వరదనీరు - చిల్లకూరు: తిప్పగుంటపాళెం చప్టాపై వరదనీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి, తహసీల్దారు శ్రీనివాసులు, ఇతర అధికారులు

ఎమ్మెల్యే విజయశ్రీకి పలువురి శుభాకాంక్షలు





ఎమ్మెల్యే విజయశ్రీకి కేక్ తినిపిస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం - ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ జన్మదిన వేడుకలను బుధవారం టీడీపీ నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యుల నడుమ కోలాహలంగా జరుపుకున్నారు. సూళ్లూరుపేటలోని టీఆర్‌ఆర్ కల్యాణ మండపంలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే విజయశ్రీకి ఆమె తండ్రి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టీడీపీ నాయకులు తరలివచ్చి ఎమ్మెల్యేను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తానంకి నానాజీ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని సన్మానించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఆస్పత్రిలో నిరుపయోగంగా ఉన్న ఎక్స్‌రే మెషిన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు చెంగాళమ్మ ఆలయంలో విజయశ్రీ కుటుంబ సభ్యులు అభిషేక పూజలు చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్, నాయకులు మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు ఉపాధి: విజయశ్రీ

సూళ్లూరుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన జాబ్‌మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఒక పరిశ్రమ ఏర్పాటు చేయకపోవడంతో యువత ఉపాధి లేకుండా నష్టపోయారన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడి దారులు ముందుకు వస్తున్నారన్నారు. జాబ్‌మేళాకు 507మంది హాజరు కాగా, 284 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారికి ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి: కురుగొండ్ల



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని అధికారులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశించారు. పట్టణంలోని మల్లమ్మగుడి వీధి వద్ద కైవ్యానది ప్రవాహాన్ని బుధవారం కురుగొండ్ల పరిశీలించారు. మల్లమ్మ గుడి వీధిలో చింతచెట్ల వద్ద నివాసముంటున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు ఎమ్మెల్యేను కలిసి తమకు అర్హత ఉన్నా టిడ్కో ఇళ్లు రాలేదని విన్నవించుకున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో పేదలను గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని ఆదేశించారు. అదేవిధంగా 12వ వార్డులో పారిశుధ్య పరిస్థితులు మెరుగు పరచకపోవడంతో దుర్గంధం వస్తోందని స్థానికులు చెప్పడంతో వెంటనే కాలువలు శుభ్రపరచాలని మున్సిపల్ కమిషనర్‌ను ఎమ్మెలే ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, సీఐ రమణ, ఎస్ఐ ఏడుకొండలు, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, మంకు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

పెళ్లకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా బుధవారం టీడీపీ మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తొలుత చిల్లకూరు వడ్డిపాళెంలో వెలసిన చండికా పరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే పేరిట పూజలు నిర్వహించారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య తదితరులు

అనంతరం పెళ్లకూరు పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వర్ణముఖి నది ఆనకట్ట ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, నాయకులు మదన్ మోహన్ నాయుడు, నేలవల్లి సిద్ధులయ్య నాయుడు, శాఖమూరి కృష్ణమ నాయుడు, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

గూడూరు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాధుపేట సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగలడంతో ఆవు మృతిచెందింది. విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు కలుజుకు మరమ్మతులు

బాలాయపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జయంపు గ్రామంలోని చెరువు కట్ట కలుజు మంగళవారం కోతకు గురైన సంగతి తెలిసిందే. బుధవారం జలవనరులశాఖ ఏఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కలుజు వద్ద మట్టి మూటలు వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.